




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 93 | ది. 11-7-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 93 | Date : 11-7-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


## జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే - సీఎం రేవంత్

- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్
- కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి



**ఖమ్మం,జూలై 10 (వార్తాప్రభ) :** 2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

## సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్





**అమరావతి,జూలై 10 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం..** సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు,దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు, విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు, సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం క్యాబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్..** రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు. అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుందని మంత్రి తెలిపారు.

**విద్యారంగానికి పెద్దపీట..** సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు.

## సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా రామాంజనేయులుకు పదోన్నతి



**అమరావతి, జూలై 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ లో సహాయ సంచాలకులుగా పని చేస్తున్న వి.రామాంజ నేయులుకు ఇటీవల ఉప సంచాలకులుగా పదోన్నతి లభించింది.గత పదేళ్ళుగా రాష్ట్ర సచివాలయంలో డిపిఆర్‌ఓగా, సహాయ సంచాలకులుగా సేవలు అందిస్తున్న ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వారి కార్యాలయంలో ఉప సంచాలకులుగా పదోన్నతి కల్పించి రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగం(పబ్లిసిటీ సెల్) లో విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు.ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి వారికి,సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధ్ వారికి రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళా పరిషత్ నుండి భూగోళశాస్త్రము, జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగాల్లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. 1996లో గ్రూప్-బి సర్వీసుల ద్వారా సహాయ పౌరసంబంధాల అధికారిగా ఎంపికై కాకినాడ జిల్లా పౌరసంబంధాల అధికారి వారి కార్యాలయంలో ఎపిఆర్‌ఓ, డివిజనల్ పిఆర్‌ఓ,డిపిఆర్‌ఓగా 19 సంవత్సరాల పాటు సేవలందించారు.రాష్ట్ర విభజన అనంతరం 2016లో విజయవాడ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వారి కార్యాలయానికి బదిలీపై వచ్చి కొంతకాలం పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల కార్యాలయంలో పని చేశారు. గత పదేళ్ళుగా రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పని చేయడంతో పాటు 11 మంది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల వద్ద కూడా సేవలు అందిస్తున్నారు.

## అధిక లాభాల ఆశ చూపి రూ.98.66 కోట్ల పెట్టుబడుల మోసం

- ఇద్దరు అరెస్టు
- ల్యాప్‌టాప్‌లు, కారు స్వాధీనం



**కాకినాడ, జూలై 10 (వార్తాప్రభ) :** స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిస్తామని, ప్రతి నెల స్థిరమైన లాభాలు అందిస్తామని నమ్మబలికి కోట్ల రూపాయల పెట్టుబడులు సేకరించి ప్రజలను మోసం చేసిన కేసులో ఇద్దరిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ నగరంలోని జిల్లా క్రీడా మైదానం ఎదురుగా ఉన్న కేఆర్‌కే ప్లాజాలో 'ఆల్టిమేట్ జెనెసిస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో కార్యాలయం నిర్వహిస్తూ 2023 జూలై నుంచి భారీ మొత్తంలో పెట్టుబడులు సేకరించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ జి బింధు మాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం కిశోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు నిర్వహించి ప్రధాన నిందితులు పులుగు మోజేష్ (సంస్థ మేనేజింగ్ డైరెక్టర్), సంధనా లలిత అంబిక (డైరెక్టర్)లను అరెస్టు చేశాయి. వారి వద్ద నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కారు, బాండ్లు, ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో మొత్తం 7,342 పెట్టుబడుల ద్వారా రూ.98.66 కోట్లకు పైగా సేకరించినట్లు గుర్తించారు. ఇందులో 3,633 పెట్టుబడులు కొనసాగుతుండగా, వాటి విలువ రూ.53.87 కోట్లుగా ఉంది. ఇప్పటివరకు లాభాలతో కలిపి రూ.16.13 కోట్లు చెల్లించగా, ఇంకా రూ.37.74 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం కిశోర్ కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ఏపీ-కొరియా భాగస్వామ్యంలో మరో అధ్యాయాన్ని లిఖించబోతున్నాం

- పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం
- కొరియాతో ఆంధ్రప్రదేశ్ ది విజయవంతమైన భాగస్వామ్యం
- ఏపీ పట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం
- కొరియా మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీని తీర్చిదిద్దుతాం
- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మా విజయ రహస్యం
- ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలి
- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ కొరియా రోడ్ షోలో మంత్రి లోకేష్ పిలుపు

**సియోల్ (సౌత్ కొరియా),జూలై 10 (వార్తాప్రభ) :** ఏపీ-కొరియా భాగస్వామ్యంలో మరో అధ్యాయాన్ని లిఖించబోతున్నాం. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం. కొరియాతో ఆంధ్రప్రదేశ్ ది విజయవంతమైన భాగస్వామ్యం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్ లో 31వ సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్ట్ నర్ షిప్ సమ్మిట్ సౌత్ కొరియా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రోడ్ షో లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సియోల్‌లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ మీ మధ్య ఉండటం ఎంతో గౌరవంగా ఉంది. అంతకంటే ముఖ్యంగా, ఇప్పటికే వేలాది మంది జీవితాలను మార్చిన, భవిష్యత్తులో ఆసియాలో అత్యంత కీలకమైన ఆర్థిక భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలిచే సామర్థ్యం ఉన్న ఈ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ముందుగా నా గురించి కొద్దిగా చెప్పాలనుకుంటున్నా. నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. అయితే గత రెండేళ్లుగా నాకు మరో ప్రధాన బాధ్యత కూడా ఉంది. అదే




ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ పెట్టుబడులు, సాంకేతికత, ఉపాధి అవకాశాలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం.

**పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం..** 2024లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నా లక్ష్యం ప్రపంచాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం... ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం. గత రెండేళ్లలో దావోస్, సింగపూర్, జపాన్, రష్యా, మధ్యప్రాచ్యం, యూరప్, ఇప్పుడు కొరియా వంటి అనేక దేశాల్లో పర్యటించాం. మా లక్ష్యం కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు... శాశ్వతంగా నిలిచే భాగస్వామ్యాలను నిర్మించడం మా లక్ష్యం. ఈ పర్యటనలో నా కొరియా మిత్రుల్లో ఒకరు నాకు ఇచ్చిన ప్రశంసను ఎంతో విలువైనదిగా భావిస్తున్నా. ఆయన నన్ను 'పల్లి పల్లి మంత్రి' అని పిలిచారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా... త్వరగా'(వేగవంతమైన) అని అర్థం. అదే విధంగా మా ప్రభుత్వం కూడా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం.

**కొరియాతో ఆంధ్రప్రదేశ్ ది విజయవంతమైన భాగస్వామ్యం..** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు అనుగుణంగా పనిచేయాలనేది మా నమ్మకం. ఫైళ్లు టేబుళ్లపై నిలిచిపోకూడదు. పెట్టుబడిదారులు కార్యాలయాల కారిడార్లలో వేచి చూడకూడదు. అనుమతుల కోసం అవకాశాలు ఆలస్యం కాకూడదు. మా ప్రభుత్వాన్ని నిర్వచించేది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. బహుశా అందుకే నాకు కొరియాలో సొంత ఇంటి వాతావరణం కనిపిస్తోంది. కొరియాతో మా సంబంధం కొత్తది కాదు. ఈరోజు ఏపీలో 35కి పైగా కొరియా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

**ఏపీ పట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం..** 2016లో కియా మోటార్స్ ఏపీలో పెట్టుబడి పెట్టాలనే ధైర్యవంతమైన నిర్ణయంతో మా ప్రయాణం ప్రారంభమైంది. కియా మోటార్స్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదు. అది మాపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. అతి తక్కువ కాలంలోనే అనంతపురంలోని కియా ప్లాంట్ ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థకు అత్యుత్తమ ఉత్పాదకత కలిగిన తయారీ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామం మరింత ముఖ్యమైంది.


### దస్తావేజు పోయినది

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్, కొత్త రాజరాజేశ్వరిపేట, ప్లాటు నెం.1855 కాపురస్తురాలు దాసరి యేసు గారి భార్య దాసరి రాజేశ్వరి అనే నా పేరిట విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఒక సేల్‌డీడ్‌ను వ్రాయించి, దానిని ది.11-12-2023వ తేదీన విజయవాడ జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో 1వ పుస్తకం, నెం.761/2024రుగా రిజిస్ట్రీ కాబడిన ఒరిజినల్ విక్రయ దస్తావేజుతో పాటు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను తీసుకొని, ది.01-07-2026న మా ఇంటి వద్ద నుండి కొత్త రాజరాజేశ్వరిపేటలో జిరాక్సు తీయించుకునేందుకు వెళుతుండగా మార్గమధ్యములో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ ఇంటి కాగితములు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయు చున్నాను.

సెల్ నెం.7386016623



### ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామ కాపురస్తురాలు పరిశె నాగబాబు గారి భార్య పరిశె నాగదేవి (అధార్.నెం.4389 4483 7776) ప్రకటన

నేను పెనమలూరు మండలం, పోరంకి గ్రామం, డోరు.నెం.10-2/ఎ నందు నివసించుచున్నాను. నేను ది.08-07-2026వ తేదిన మా ఇంటి వద్ద నుండి నాకు గల గొల్లగూడెం గ్రామ పునాదిపాడు రెవిన్యూ రీ.సర్వే.నెం.386/4 రు, ప్లాట్ నెం.17 రులో చ.గ.194.44లు గల నెం.5550/2006 రు గల ఒరిజినల్ డాక్యుమెంట్స్‌లను కవర్‌లో పెట్టుకొని పెనమలూరు (పోరంకి) సెంటర్‌లో జిరాక్స్ షాపు నందు జిరాక్స్‌లు తీసుకొని బండి మీద ఇంటికి వచ్చి చూడగా సదరు డాక్యుమెంట్ పెట్టిన కవర్ కనపడకుండా పోయినది. మా ఇంటి వద్ద నుండి కనబడిన వారిని అందరిని అడుగుచూ పెనమలూరు (పోరంకి ) సెంటర్ వరకు వచ్చియున్నారు. ఎవరికి కవర్ కనిపించలేదు అని చెప్పియున్నారు. నాకు ఎక్కడ నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ కవర్ కనిపించలేదు. ఒరిజినల్ డాక్యుమెంట్స్ కవర్ ఎవరికైనా కనబడిన,దొరికిన నాకు ఈ కింది అడ్రస్ లో అందచేయగలరని కోరుతున్నాను...

ఇట్లు :

**పరిశె నాగదేవి, W/o పరిశె నాగబాబు**

**పోరంకి గ్రామం, పెనమలూరు మండలం**



### పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్, సీతారామపురం, విశాలాంధ్ర రోడ్డు, డోరు నెం.33-22-26 కాపురస్తుడు షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ బాజీ అను నా వద్దనున్న గంద్ర అశోకవర్ధన్‌కు చెందిన హైదరాబాద్‌లో ది.25-05-2001వ తేదీన నెం.ఎ9689386 గల ఒరిజినల్ పాసుపోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను బండికి తగిలించుకొని, నేను ది.06-06-2026వ తేదీన ఏలూరులోని వసంతమహాల్ సెంటర్ నందు జారిపడిపోయినది. వెంటనే పాసుపోర్టు కలిగిన ఫైల్ పరిసర ప్రాంతములలో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9493102316


### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పుట్టినరోజు...
## కేక్ కట్ చేయించిన సీఎం చంద్రబాబు



**అమరావతి,జూలై 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రే స్వయంగా ఆనం రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆనంకు కేక్ తినిపించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ వేడుకతో కాన్ఫరెన్స్ హాలులో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర మంత్రులు కూడా ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ను సందర్శించిన కృష్ణమోహన్

● గురుకులంలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై ఆరా తీసిన రిటైర్డ్ ఐఏఎస్,రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీస్ శాఖ డైరెక్టర్





**జి.కొండూరు,జూలై 10 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండల పరిధిలోని కుంటముక్కల గ్రామ శివారు డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం ను రిటైర్డ్ ఐఏఎస్,రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీస్ శాఖ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ ఏ.ఎం.వో శిరీష, ఎంఈవో-2 యమ్.వీరాస్వామి లతో కలిసి గురుకులంలో అమలవుతున్న పీఎం శ్రీ పథకం పై ఆరా తీశారు.అలాగే పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. స్మార్ట్ క్లాస్ రూమ్స్ , సైన్స్ ల్యాబ్ లు, డిజిటల్ బోధన, గ్రంథాలయం, యోగా, కరాటే శిక్షణ,క్రీడా కార్యక్రమాలతో పాటు భోజన నాణ్యత, డైనింగ్ హాల్ శుభ్రత తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయి, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.బ్యూల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజాధిరాజు మా ప్రేమ రాజు

-నివాళులర్పించిన పెద్దలు



**విసన్నపేట,జూలై 10 (వార్తాప్రభ)** రాజకీయాలలో ఆయా పార్టీలల సిద్ధాంతాలకు ఆకర్షితులవుతూ ముందుకు వెళ్ళటం సహజమైన సమాజంలో అందరినీ ప్రేమ ఆప్యాయతలు కలుపుగోలుతనంతో కలుపుకు పోవడం అనేది దివంగత ప్రేమ రాజుకు మాత్రమే దక్కిందని మాజీ ఎంపీపీ పీఎం వనజాక్షి భర్త రాజేష్ తెలియజేశారు. ప్రేమ రాజు పార్థివ దేహానికి పూలదండలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బివి రామారావు, వైసిపి నాయకులు భాస్కరరావు తదితరులు నివాళులు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పేదలకు మెయిల్ క్రిష్ణారెడ్డి సేవలతో ఆర్థిక స్వావలంబన...



**గుడ్లవల్లేరు,జూలై 10 (వార్తాప్రభ) :** మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సేవలతో మండలంలోని పేద కుటుంబాల వారు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబన ఏర్పడుతుందని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థికసాయంతో మండలంలోని శేరీ దగ్గుమిల్లి సచివాలయ పరిధిలోని కట్టవానిచెరువు గ్రామానికి చెందిన లబ్ధిదారుడు దాసి శ్రీనివాసరావుకు రూ.75,200 విలువైన కూలర్, ఫ్రీజర్ జీవనోపాధి యూనిట్‌ను మెయిల్ ప్రతినిధి చేతన్ చేతుల మీదుగా అందజేశారు. పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఈ సేవలను అందించి ఆయా కుటుంబాలకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

## కృష్ణా జిల్లాలో వివిఎం--2026--27 కరపత్రాల ఆవిష్కరణ

● జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, డీఈవో చేతుల మీదుగా ప్రచారానికి శ్రీకారం

● ప్రచారాన్ని ముందుండి నడిపిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీమతి జాగృతి

**హనుమాన్ జంక్షన్,జూలై 10 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, దేశంలోనే అతిపెద్ద డిజిటల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షగా గుర్తింపు పొందిన విద్యార్థి విజ్ఞాన మంథన్ ( వివిఎం)--2026--27 నమోదు కార్యక్రమానికి కృష్ణా జిల్లాలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, జాయింట్ కలెక్టర్ శ్రీమతి నమ్రతా శుక్లా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యు.వి. సుబ్బారావు గార్ల చేతుల మీదుగా వివిఎం--2026--27 కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా విద్యార్థి విజ్ఞాన మంథన్ (వివిఎం) జిల్లా కోఆర్డినేటర్ శ్రీమతి జాగృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లాలో వివిఎం--2026--27 ప్రచార కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, పరీక్ష విశిష్టత, నమోదు విధానం, విద్యార్థులకు లభించే ప్రయోజనాలను జిల్లా అధికారులకు వివరించారు. అలాగే జిల్లాలోని అన్ని పాఠశాలలు విస్తృతంగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా భారతీయ విజ్ఞానమండలి (VIBHA) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి సైన్స్ ప్రతిభా అన్వేషణ పరీక్షలో జిల్లాలోని అన్ని పాఠశాలలు చురుకుగా పాల్గొని, ఎక్కువ మంది విద్యార్థులను నమోదు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.



6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. నమోదు ప్రక్రియ కొనసాగుతుండగా, చివరి తేదీ 30 సెప్టెంబర్ 2026గా నిర్ణయించారు. ముందుగా పాఠశాల నమోదు పూర్తి చేసి, అనంతరం విద్యార్థుల నమోదు చేయాల్సి ఉంటుంది. "శాస్త్రం వైపు ఒక అడుగు... భవిష్యత్తు వైపు ఒక పెద్ద ముందడుగు!" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా వివిఎం కోఆర్డినేటర్ శ్రీమతి జాగృతి విజ్ఞప్తి చేశారు.

## 15వ తేదీ నుండి 24 వరకు వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

-వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న వెల్లడి




**కాకినాడ రూరల్,జూలై 10 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ కొవ్వూరులో వారాహి అమ్మవారి ప్రాంగణంలో గుప్త నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.15వ తేదీ ఉదయం 5గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభం అవుతుందని కాశీ క్షేత్ర పరిపాలకురాలుగా అమ్మవారి కీర్తి ఎంతో ఉందన్నారు. భక్తులు సమస్యలు నుంచి త్వరితగతిన బయట పడేందుకు అమ్మవారిని ఉపాసనతో ప్రార్థించాలని, ఉదయం వేళల్లో అమ్మవారికి దీపారాధనలు చేసి రాత్రి వేళల్లో పూజిస్తే అనుకున్న పనులు జరుగుతాయని వివరించారు. అమ్మవారికి పానకం, చక్రపొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పించాలన్నారు. అమ్మవారు భూదేవత అయినందున క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు, కాయగూరలుతో పాటు భూమి నుంచి వచ్చే ఆహార పదార్థాలు అన్నీ ప్రసాదం రూపంలో పెట్టవచ్చన్నారు. తమ ప్రాంగణంలో నిర్విరామ అన్నదానం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మామూలు రోజులు కన్నా అమ్మవారిని ఆషాఢమాసంలో భక్తితో పూజించడం వలన కుటుంబం అంతటికీ అనుగ్రహం వేగంగా లభిస్తుందన్నారు. దీక్ష చేపట్టే వారు భూ శయనం, బ్రహ్మచర్యం, ఒంటి పూట భోజనం, కాయగూరల భోజనం తిని నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేసారు. గుప్త నవరాత్రుల తర్వాత తాను విశ్రాంతి తీసుకుంటానని, ఆలయం స్థాపించినప్పటి నుండి నిర్విరామంగా అమ్మవారికి సేవలు చేస్తున్నానని తమ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఇంటిలో పూజించే అమ్మవారిగా కొలిచామని లక్ష్మీ ప్రసన్న తెలిపారు. రాష్ట్రస్థాయిలో కొవ్వూరు అమ్మవారికి ఇంత ఆదరణ లభిస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్త కాళ్ళ సత్యనారాయణతో పాటు అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ఎవరు గెలవాలన్న మూడు ఉండాల్సిందే..

**విస్సన్నపేట,జూలై 10 (వార్తాప్రభ) :** ఒక ప్రజా ప్రతినిధి ఎన్నికలలో విజయం సాధించాలంటే నేటి సమకాలీన రాజకీయ ఆర్థిక సమీకరణల తో పాటు మరో మూడు రకాల బలాలు ఉండాల్సిందేనని రాజకీయ మేధావులు అనుకుంటున్నారు.ప్రజల నమ్మకం, సంస్థాగత బలం, సరైన వ్యూహం తప్పనిసరిగా ఉండవలసిందే అని సర్వత్రా వినిపిస్తోంది.



**ప్రజలతో సంబంధం**

**నమ్మకం:** మాట ఇచ్చి నిలబెట్టుకునే వ్యక్తిగా మంచి పేరు ప్రజలు ఇతను మన సమస్య వింటాడు అనే నమ్మకం,

**అందుబాటు:** గ్రామంలో వార్డులలో తరచుగా కనిపించడం. కష్టంలో ఉన్నప్పుడు తోడుగా ఉండడం వీటితోపాటు సమస్యలపై అవగాహన సంపూర్ణ అవగాహన తాగునీరు, రోడ్లు, ఉపాధి, ఆరోగ్యం, విద్య లాంటి స్థానిక సమస్యలపై క్లియర్ పరిష్కారాలు చెప్పగలగడం,

**సంస్థాగత బలం:** కార్యకర్తల బృందం బూత్ స్థాయి నుండి మండలం వరకు పనిచేసే నమ్మకమైన టీమ్, ఎన్నికల రోజు ఓటు వేయించడం వీళ్ల వల్లే జరుగుతుంది కనుక పోల్ మేనేజ్మెంట్ లో సంపూర్ణ అనుభవం కలిగి ఉండాలి.

వీటన్నిటిని మించి పార్టీ మద్దతు టికెట్, ఫండింగ్, స్టార్ క్యాంపెయినర్లు, పార్టీ క్యాడర్ సపోర్ట్ చాలా కీలకం.

**వనరులు:** ప్రచారానికి డబ్బు, వాహనాలు, సోషల్ మీడియా టీమ్, కరపత్రాలు, సభలు. వైరీవర్గాల గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యలకు వారి ఎత్తులకు పై ఎత్తులు వేయగలిగిన సత్తా కలిగిన ఎన్నికల వ్యూహం.

**స్పష్టమైన ఎజెండా:** తనను గెలిపిస్తే తప్పకుండా పలానా పనులు చేస్తాను అని భరోసా ఇవ్వగలిగిన కాంక్రీట్ హామీలు.

**-ప్రచారం:** కాలి నడక, గ్రూప్ మీటింగ్‌లు, సోషల్ మీడియా రీల్స్, పోస్టర్లు. ప్రతి వర్గానికీ వేరుగా మెసేజ్ వెళ్లాలి.

ప్రత్యర్థిపై కాకుండా పనిపై ఫోకస్: విమర్శల కంటే నేను ఏం చేస్తాను అనేది బలంగా చెప్పడం.

**చట్ట పరిధిలో ఉండడం:** డబ్బు, మద్యం పంపకాలు లాంటివి లీగల్ రిస్క్ తెస్తాయి. దీర్ఘకాలంలో పేరు పాడవుతుంది.

**అదనంగా కలిసొచ్చేవి**

**ప్రతిష్ట :** నిజాయితీ, సేవా మనస్తత్వం ఉన్న లీడర్‌గా గుర్తింపు

**సమయం:** ఎన్నికలకు 6 నెలల ముందు నుండే ప్రజలలో ఉండడం.

**స్థానిక సమీకరణాలు :** కులాలు, సంఘాలు, యువత, మహిళల మద్దతును కూడగట్టడం.

ఎన్నికల ముందు ఏమైతే హామీలు ఇచ్చామో గెలిచాక ఇచ్చిన మాట నిలబెట్టుకుంటేనే తర్వాతి ఎన్నికలలో కూడా గెలుస్తారు. గెలుపుకు పరంపద సోపానాలైనా సుదీర్ఘ కాలంగా అందరూ పాటించే పై విషయాలను ఆచరణలో పెట్టినవారు గెలుపు నల్లేరుపై నడకని చెప్పవచ్చు తెలుస్తోంది.

## 'సర్' పనులు శరవేగంగా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక చర్యలు

-మున్సిపల్ కమిషనర్ కే. మనోజ్

**తిరువూరు,జూలై 10 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరువూరు మున్సిపాలిటీ పరిధిలోని 27 పోలింగ్ స్టేషన్లలో 'సర్' కార్యక్రమాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కే. మనోజ గతెలిపారు. ఆమెమాట్లాడుతూ... కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ & ఆర్.డి.ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు డేటా కలెక్ట్ చేస్తున్నాం. దీూా లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో కలిసి రోజుకు 2 సార్లు పురోగతిని సమీక్షిస్తున్నాం" అన్నారు. 27 PS ల పరిధిలో ఇంటింటి వెరిఫికేషన్ దాదాపు పూర్తి తుది దశకు చేరుకుంది . డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా 100% దోషరహిత ఓటర్ల జాబితా ఇవ్వడమే మా లక్ష్యం" అని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలు 'సర్' కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ప్రజలకు అందించిన ఫారాలు త్వరగా



సిబ్బందికి అందించాలని , ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేనలో కీలక పదవి కోసం చిలంకుర్తి పృథ్వి ప్రసన్న ప్రయత్నాలు



**పెడన,జూలై 10 (వార్తాప్రభ) :** జనసేనలో కీలక పదవి కోసం చిలంకుర్తి పృథ్వి ప్రసన్న ప్రయత్నాలు చేస్తున్నారు.గతంలో ప్రజారాజ్యం పార్టీలో ఆయన ఉమ్మడి కృష్ణాజిల్లా యువరాజ్యం అధ్యక్షునిగా పనిచేసారు. అలాగే బీజేపీ మజదూర్ మోర్చా జిల్లా అధ్యక్షునిగా రెండు పర్యాయాలు బాధ్యత లు నిర్వహించారు. పోర్టు సాధనకోసం జరిగిన ఉద్యమంలో 99 రోజులు రిలే నిరాహార దీక్షలు 9 రోజుల ఆమరణ దీక్ష చేసారు.. మరికొన్ని ప్రజా ఉద్యమాలతో ప్రసన్నకు ప్రత్యక్ష సంబంధాలున్నాయి.రోటరీ అధ్యక్షులు గా కూడా పేదలకు వైద్య సేవలు అందెందుకు కృషి చేసారు. గత కొన్ని సంవత్సరాలుగా జనసేన పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ పదవుల పంపకానికి శ్రీకారం చుట్టింది. సమాచార సేకరణ సారధుల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. శాసన మండలి సభ్యుడు పిడుగు హరిప్రసాద్ కు ప్రసన్న తన దరఖాస్తును అందజేశారు. పార్టీలో కీలక పదవికోసం తాను ప్రయత్నిస్తున్నట్టు ప్రసన్న వార్తప్రభ ప్రతినిధికి చెప్పారు.

## శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరమా సత్యన్నారాయణ స్వామి వారి వ్రతాలు



**హనుమాన్ జంక్షన్,జూలై 10 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దేవాలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని అరుణ బాబు పుణ్య దంపతులచే ప్రతి నెల భక్తులకు పూజా సామాగ్రి,పూలు,పండ్లు, కొబ్బరికాయలు,పసుపు కుంకుమ ఇతర పూజా సామాగ్రి ఉచితంగా అందించి నిర్వహించే పూజా కార్యక్ర మాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలు వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.శ్రీ రమా సత్యన్నారాయణ స్వామి వారి సామూహిక వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులకు కాకాని అరుణ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


## పెడనలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం



**పెడన,జూలై 10 (వార్తాప్రభ) :** పెడన అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోగల గూడూరు రోడ్డు సచివాలయం నెంబర్ వన్ లో జరిగిన యు హెచ్ ఎస్ ఎన్ సి సమావేశం శుక్రవారం జరిగింది. డెంగ్యూ వ్యతిరేక మాసో త్సవము ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ ర్యాలీలో హెల్త్ సూపర్వైజర్ సూరిబాబు ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ గారు హెల్త్ అసిస్టెంట్ సతీష్ బాబు ఆశా వర్కర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కార దిశగా జనసేన పార్టీ నాయకులు






**తిరువూరు,జూలై 10 (వార్తాప్రభ) :** తిరువూరు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రజల వద్ద నుండి వినతులు స్వీకరించి పరిష్కార మార్గానికి చొరవ తీసుకున్న జనసేన పార్టీ నాయకులు పసుపులేటి నరేష్ మిత్ర (పండు) లింగినేని సుధాకర్ (అడ్వకేట్) పసుపులేటి రవీంద్ర పల్లెపాటి రవి ఈ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నారు..పట్టణంలోని 10వ వార్డు సుందరయ్య కాలనీ లోని డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది వెంటనే మరమ్మతులు చేపట్టాలని కార్యాలయం మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు..ప్రభుత్వ ప్రైవేటు హాస్పటల్స్ వందు జన్మంచిన శిశువుల రికార్డు లను స్థానిక హాస్పిటల్స్ వారి అలసత్వం వల్ల నమోదు కార్యక్రమంలో తీవ్ర జాప్యం జరుపుతుంది.. హాస్పటల్యాజమాన్యానికి తగు సూచనలు చేసి రికార్డు నమోదు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.. జన ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రజలు తిరగాల్సి వస్తుంది అటువంటి ఇబ్బందులు ఏమీ లేకుండా చర్యలు తీసుకోవాలని మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు.టిడ్కో ఇళ్ళు రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు..

## రూ.105 కోట్లతో కాకినాడ స్మార్ట్ సిటీ పనులకు ఊపిరి.. నిలిచిపోయిన ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ,జూలై 10 (వార్తాప్రభ) :** కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో గత కొంతకాలంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.105 కోట్లు విడుదల చేయడం నగరాభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆర్థిక పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ కాకినాడ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి నగర ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సినిమా రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవనాన్ని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రారంభమైన సమయంలో నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నగరపాలక సంస్థకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కార్పొరేషన్ భవనం నిర్మించడం, అన్ని పరిపాలనా కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం, దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అనేక ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను రూపొందించామని ఆయన చెప్పారు. అయింతే ప్రభుత్వం మారిన తర్వాత గత ఐదేళ్లలో స్మార్ట్ సిటీ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని విమర్శించారు. కార్పొరేషన్ నూతన భవనంతో పాటు ఇతర స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. కాకినాడ నగర



జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త వాటర్ స్కీమ్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో జాతీయ రహదారి-216ను అనుసంధానించే మూడో వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదించి, దానికి అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. మోడల్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం, జన్మభూమి స్టేడియం అభివృద్ధి వంటి పలు కీలక ప్రాజెక్టులు కూడా గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలోని అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు రూ.105 కోట్లు విడుదల చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో కార్పొరేషన్ భవనం సహా వివిధ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ భవనాన్ని కమిషనర్‌తో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్న ఆయన, అవసరమైన సాంకేతిక మార్పులు, చేర్పులు చేసి నాణ్యతతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. మూడో వంతెన నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే కొత్త తాగునీటి పథకానికి కూడా ఆమోదం లభించడం వల్ల కాకినాడ నగర భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ కాకినాడ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రూ.105 కోట్లు విడుదల చేసి నిలిచిపోయిన స్మార్ట్ సిటీ పనులకు మళ్లీ ఊపిరి పోసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నగర ప్రజల తరఫున మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి కాకినాడను ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. వెంకట్రావు, డి ఈ ఆదినారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మణికంఠ, మచ్చరాజు, సి.వి.ఎ.పి బృంద సభ్యులు మేచినేని దివ్య రాణి , బండారు జ్యోతి సుష్మ, వడ్డి సూర్య కుమారి,నంబారు సాయి పూజ సంబంధిత కాంట్రాక్టర్ సుధాకర్, స్మార్ట్ సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్రస్థాన్ ప్రహరీ కి రూ.10 లక్షల రూపాయలు మంజూరు

**నిధులు మంజూరు చేసిన రాజ్యసభ సభ్యులు (ఎంపీ ) వద్దిరాజు రవిచంద్ర**

**ఇచ్చిన మాట నిలుపుకున్న బిఆర్ఎస్ పార్టీ 22 వ వార్డు అభ్యర్థిని చింతలపూడి ,పార్వతిడ జగన్**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, ఓడిన ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలుపుకున్నాము కొత్తగూడెం కార్పొరేషన్ సుజాతనగర్ బిఆర్ఎస్ పార్టీ 22 వ వార్డు అభ్యర్థిని చింతలపూడి ,పార్వతిడ జగన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు సంబంధించిన కబరస్థాన్ పహరి గోడ నిర్మాణం ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం 10 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయి అన్నారు బీఆర్ఎస్ పార్టీ తరఫు నుండి కార్పొరేషన్ ఎన్నికల ఇన్చార్జి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకి ఆనాడు సమస్యలను తెలియజేయగా మాట ప్రకారమే చెప్పినట్లుగానే నేడు 10 లక్షల రూపాయలు కబురస్థాన్ ప్రహరీ గోడ నిర్మాణం ఇతర అవసరాల కోసం నిధులు మంజూరు చేశారని అన్నారు నిధులు మంజూరు పత్రము కలెక్టర్ కి వద్దిరాజ్ రవిచంద్ర పంపించడం జరిగిందని. అదే లేఖను శుక్రవారం ముస్లిం మత పెద్దలకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు వారం రోజుల్లో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలియజేశారు నిధులు మంజూరు చేసిన రాజ్యసభ సభ్యులు ఎంపీ వద్దిరాజ్ రవిచంద్ర కి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తరఫున సుజాతనగర్ మసీద్ ముస్లిం పెద్దలు డాక్టర్ అనీష్ తరఫు నుండి మరియు సుజాతనగర్ ప్రాంత ముస్లిం సమాజం తరఫు నుండి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ,పెద్దమల్ల నరేంద్ర ప్రసాద్ చింతలపూడి జగన్ మండే చంటి ఎస్ కే బాబా ఎస్ కే బనగీ సాబ్ ఎస్ కే షర్ఫుద్దీన్ చింతల ప్రదీప్పులి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## దివంగత నేత స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయసాధనే నిజమైన నివాళి... వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి, జులై 10(వార్తాప్రభ):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ దివంగత నేత స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లిలో, వివేకానంద నగర్ కాలనీలో గల వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహాల వద్ద బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని వడ్డేపల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ప్రజాసేవను జీవిత ధ్యేయంగా భావించి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత నాయకుడ నీ కొనియాడారు. పదవిని ప్రజాసేవకు సాధనంగా ఉపయోగించుకొని, నిరాడంబర జీవనం, నిబద్ధత, నిజాయితీతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు అన్నారు. ఆయన ఆశయ సాధనే వారికి మనం అర్పించే నిజమైన నివాళి సమాజాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన బాటలో నడుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని రాజేశ్వరరావు అన్నారు.

# గబ్బిలాల పేట పాఠశాలపై సత్వరమే నిర్ణయం తీసుకోండి.

**పాఠశాల సాధన కమిటీ జేఏసీ వినతి.**





**జవహర్ నగర్, జూలై 10:(వార్తా ప్రభ)**కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాల కోసం స్థలాన్ని సత్వరమే కేటాయించాలని గతంలో ప్రజావాణిలో చిన్నారెడ్డి కి వినతిపత్రం ఇవ్వగా వారు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కి తొందరగా ఆ స్తలం కేటాయింపు పై చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగింది. దాంట్లో భాగంగా నేడు గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాల సాధన చేసి ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి ని కలిసి చిన్నారెడ్డి ఇచ్చినటువంటి వినతి పత్రంలో పేర్కొన్న అంశాలను ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా ప్రజల కోసం విద్యా అందించాలని ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను కేటాయిస్తే న్యాయం జరుగుతుందని అలాంటి న్యాయం కోసం ప్రజలందరూ ఐక్యంగా పోరాడిన అధికారులు అంతగా దృష్టి పెట్టకుండా నాన్చుట ధోరణి తగదని వెంటనే ప్రభుత్వ పాఠశాల కోసం స్థలాన్ని కేటాయించాలని ప్రజలు ఎక్కడైతె ఉన్నారో అక్కడే కేటాయించాలి కానీ కిలోమీటర్ల దూరంలో కేటాయించకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ కి చెప్పడం జరిగింది. చేసిన పంతం ప్రచారం చేయకుండా వెంటనే కేసు లో ఇంక్లూడ్ అయి సమస్యను పరిష్కరించాలని చిన్నారెడ్డి చెప్పినటువంటి మాటలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ కన్వీనర్ తోటపల్లి శంకర్, కొకన్వీనర్ నరసింహులు గౌడ్, షేక్ షావలి, అనురాధ,న్యూ డెమోక్రస(ఐ ఎఫ్ టి యు) సిపిఎం శివన్నారాయణ, జయసుధ (పిడి డబ్ల్యు)మంజుల(ట్రై ఆ లూరిసావిత్రి చైతన్య మహిళా సమైక్య సంస్థ)సూర వెంకటయ్య, (బి ఎన్ఆర్ కె ఎస్)సునీల్ (క్రైసంస్థ)దుర్గేష్(బి ఆర్ ఎస్) తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రజాపాలన

- సింగరేణిని సర్వనాశనం చేసింది బీఆర్ఎస్ ● కాళేశ్వరం పేరుతో కోట్ల దోపిడీ
- కటీఆం-హరీశ్‌రావు మాటలు పొంతనలేవు ● తూర్పు-పడమరలా బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు
- కవితే చెబుతోంది బీఆర్ఎస్ నిజాలు ● ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 10 (వార్తాప్రభ)**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పారదర్శక పాలన అందిస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం రామగుండంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని ప్రజల కోసం కాకుండా స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగించిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సింగరేణి సంస్థను గత ప్రభుత్వం దోపిడీకి గురి చేసి సర్వనాశనం చేసే పరిస్థితికి తీసుకెళ్లిందని ఆరోపించారు. సింగరేణిలో జరిగిన అక్రమాలు, బొగ్గు మాయం, టెండర్లలో అవకతవకలు, ప్రజా సంపద దుర్వినియోగం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రజల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును అవినీతికి అడ్డాగా మార్చి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని విమర్శించారు. భారీ ఎత్తున ఖర్చు చేసినప్పటికీ ప్రాజెక్టు నాణ్యత, నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యం కారణంగా ప్రజలపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. ఇప్పుడు ఆ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ప్రకటనలు ఒకదానికొకటి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని, వారి మాటలు తూర్పు--పడమరలా భిన్నంగా మారాయని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఒకరు చెప్పిన మాటను మరొకరు ఖండించే పరిస్థితి నెలకొనడం ద్వారా బీఆర్ఎస్‌లో నాయకత్వ సంక్షోభం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పార్టీలో ఏమి జరుగుతుందో ఆ పార్టీ నాయకులకే అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల పక్షాన మాట్లాడుతున్నట్లు నటించడం హాస్యాస్పదమన్నారు. కల్వకుంట్ల కవిత స్వయంగా పార్టీ అంతర్గత విషయాలను బహిర్గతం చేస్తూ నిజాలను బయటపెడుతున్నారని, దీంతో బీఆర్ఎస్ పాలనలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇంటి గుట్టును ఇంటివారే బయటపెడుతుండటంతో ప్రజలకు అసలు నిజాలు అర్థమవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఎన్నికల హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రజల ప్రతి రూపాయి ప్రజలకే ఉపయోగపడే విధంగా పాలన సాగుతోందని, అవినీతి రహిత పరిపాలన ద్వారా అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తెలంగాణ ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ప్రజా ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు గట్ల రమేష్, సతీష్, కల్వల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్‌కు ఊరట!!

- ఏళ్ల నాటి కాలువ సమస్యకు పరిష్కారం ● కాలువలో ప్లాస్టిక్ చెత్త వేయొద్దు ● మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 10 (వార్తాప్రభ):**రామగుండం నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న దీర్ఘకాలిక సమస్యలను వార్డు పర్యటనల ద్వారా దశలవారీగా పరిష్కరిస్తున్నామని మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. శుక్రవారం 23వ డివిజన్ ప్రగతి నగర్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ కాలువ నుంచి వచ్చే నీరు ఎన్టీపీసీ ప్రహరీ గోడ పక్కన సంవత్సరాలుగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కార్పొరేటర్ బెంద్రం సునీత మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మేయర్ ఆదేశాల మేరకు జేసీబీలు, బ్లేడ్ ట్రాక్టర్‌ను రంగంలోకి దించి కాలువలో పెరిగిన చెట్ల గుబుర్లు, పూడిక, చెత్తను పూర్తిగా తొలగించారు. అనంతరం ఎన్టీపీసీ పీటీఎస్ పరిధిలోని డ్రెయిన్‌ను కూడా శుభ్రం చేయించి, ప్రగతి నగర్ నుంచి వచ్చే నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్న నీరు సాఫీగా పారడం ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాలువ వద్ద ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన గ్రిల్స్‌కు ప్లాస్టిక్ వ్యర్థాలు చిక్కుకుపోవడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని మేయర్ తెలిపారు. భవిష్యత్తులో కాలువ మళ్లీ పూడిపోకుండా పైపుల ఏర్పాటు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం చేపట్టిన పూడిక తొలగింపు పనులతో వర్షాకాలంలో ప్రగతి నగర్ ఇళ్లలోకి వరద నీరు చేరే ప్రమాదం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తను కాలువల్లో వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి నగర పరిశుభ్రతకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. కాలువ నిర్వహణలో ఎన్టీపీసీ అధికారులు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, టీపీఎస్ నవీన్, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, శానిటరీ జవాన్ సంపత్, ఎకో వారియర్స్ కన్సల్టెన్సీ సభ్యులు స్వరూప్, మహేంద్ర, వాటర్ సప్లై సూపర్‌వైజర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ.. నారాయణ..!!

- విద్యా దేవాలయంలో 'బుక్స్' వ్యాపారం ● సీక్రెట్ రూమ్‌లో 'ప్యాకింగ్' కూలీలుగా టీచర్లు ● పట్టుబడిన వారానికే బుక్స్ దందా రీ-స్టార్ట్ ● ఎంఈవో హెచ్చరికలు తుస్.. కార్పొరేట్ దందా ఖాస్ ● చట్టాలంటే లెక్కలేదు.. అధికారులంటే భయం లేదు ● ఏమి చేసినా చెల్లుతుందనే అహంకారం ● "ఆ"విద్యాసంస్థల అక్రమాలకు బ్రేకులు వేసేది ఎప్పుడు?





**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 10 (వార్తాప్రభ):**తెలుగు రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థను శాసిస్తున్న "ఆ" విద్యాసంస్థల పుస్తకాల దందా ఇప్పుడు పరాకాష్టకు చేరింది. చదువుల పేరుతో తల్లిదండ్రుల రక్తాన్ని ఫీజుల రూపంలో పిండేయడమే కాకుండా, పుస్తకాలు, యూనిఫారాల పేరుతో అడ్డగోలు దోపిడీకి తెరలేపారు. "ఏమి చేసినా.... ఎలా చేసినా..... మా వ్యాపారం ఆగదు" అన్నట్టుగా సాగుతోంది వీరి వ్యవహారం.

**టీచర్లతో కూలీ పనులా?! గురు స్థానానికి ఇంతటి అవమానమా?** సమాజంలో అత్యున్నత స్థానంలో ఉండాల్సిన ఉపాధ్యాయులను ఈ కార్పొరేట్ యాజమాన్యం ఏ స్థాయికి దిగజార్చిందో చూస్తే గుండె తరుక్కుపోతుంది. విద్యార్థులకు పాఠాలు చెప్పి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లను.. గోదావరిఖని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల దగ్గరలోని ఒక అపార్ట్‌మెంట్‌లో బంధించి మరీ పుస్తకాలు ప్యాక్ చేయిస్తున్నారు. అవును, ఇది అక్షరాలా నిజం! ఒక రహస్య అపార్ట్‌మెంట్‌ను అడ్డాగా మార్చుకుని, ఉపాధ్యాయులను క్లాస్ రూమ్‌ల నుంచి లాక్కొచ్చి, అక్కడ బుక్స్ ప్యాకింగ్ పనుల్లో పెట్టారు. సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన గురువులను ఇలా లేబర్లకంటే హీనంగా మార్చడం ఏ రకమైన విద్యా విధానం? ఈ దృశ్యాలు చూశాకైనా తల్లిదండ్రుల కళ్లు తెరవవా?

**ఎంఈవో హెచ్చరికలు తుస్.. కార్పొరేట్ దందా ఖాస్** గతంలో ఈ దందాపై ఫిర్యాదులు రావడంతో అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కానీ, విచిత్రం ఏమిటంటే... పట్టుబడిన వారం రోజులకే మళ్లీ అదే దందా, మరొక అపార్ట్‌మెంట్‌లో యథేచ్ఛగా ప్రారంభమైంది. ఇక్కడ సామాన్యుడికి వచ్చే అనుమానం ఒక్కటే... అసలు క్షేత్రస్థాయిలో ఉన్న మండల విద్యాధికారుల (ఎంఈవో) చర్యలు సరిపోవడం లేదా? లేక అధికారుల చర్యలు కేవలం కంటితుడుపు కోసమేనా? ఒకసారి పట్టుబడిన తర్వాత కూడా అంత ధైర్యంగా మళ్లీ అదే తప్పు చేస్తున్నారంటే, అధికారుల హెచ్చరికలను వీరు ఎంత తేలిగ్గా తీసుకుంటున్నారో అర్థమవుతోంది. చట్టాలు, నిబంధనలు కేవలం పేదవాడి కోసమేనా? ఈ కార్పొరేట్ తిమింగలాలను తాకే ధైర్యం ఇక్కడి వ్యవస్థకు లేదా?

**ఇంతకూ... వీరి బలం ఏమిటి?** వ్యవస్థలను మేనేజ్ చేయగల ధన బలమా? లేక వెనుక ఉండి నడిపించే రాజకీయ బలమా? ఏ తప్పు చేసినా చెల్లుతుందనే అహంకారం ఎక్కడిది? ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా వీరి దోపిడీ సామ్రాజ్యం మాత్రం చెక్కుచెదరకుండా సాగిపోతోంది.

**నిలదీయాల్సిన సమయం వచ్చింది** లక్షలు పోసి చదివిస్తున్న తల్లిదండ్రులారా... ఆలోచించండి! మీ పిల్లలకు విద్యను అందిస్తున్నారా, లేక ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యానికి పెట్టుబడిగా మారుస్తున్నారా? గురువులను గౌరవించలేని ఈ విద్యాసంస్థలు, మీ పిల్లలకు సంస్కారాన్ని ఎలా నేర్పుతాయి? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ అక్రమ పుస్తకాల దందాపై శాశ్వత చర్యలు తీసుకోకపోతే, విద్యా వ్యవస్థ పూర్తిగా కార్పొరేట్ మాయాజాలంలో సమాధి కావడం ఖాయం.



వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఎన్టీపీసీలో రైల్వే భద్రతకు మరో ముందడుగు!!

- ఎంజీఆర్ నెట్‌వర్క్‌లో ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌ల కమిషనింగ్ ● సిగ్నలింగ్ వ్యవస్థ మరింత బలోపేతం
- స్టేజ్-2 నిర్మాణానికి ఊతమిచ్చిన కొత్త రైల్వే అనుసంధానం



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 10 (వార్తాప్రభ):**ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు మరో కీలక మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. రామగుండం ఎంజీఆర్ రైల్వే నెట్‌వర్క్‌లో ఇప్పటికే అమలులో ఉన్న రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ ఆర్ఆర్ఐ వ్యవస్థతో అనుసంధానించిన సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఎస్అండ్‌టీ ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌లను నిర్ణీత నాన్-ఇంటర్‌లాకింగ్ ఎన్ఐ వ్యవధిలో విజయవంతంగా కమిషన్ చేసింది. ఈ ఆధునిక వ్యవస్థను ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఏజీఎం ముకుల్ రాయ్, రామగుండం జీఎం మనీష్ అగర్వాల్, తెలంగాణ జీఎం ప్రాజెక్ట్ బినోయ్ జోస్‌తో పాటు హెచ్‌ఓహెచ్ఆర్, జీఎస్ ఎన్ఈఏఆర్, ఈఈడీ, సీసీడీ, ఎఫ్‌టీ, ఎంజీఆర్, సేఫ్టీ, సీహెచ్‌పీ విభాగాల అధికారులు, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు. ఈ కొత్త ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌ల ఏర్పాటు ద్వారా ఎంజీఆర్ రైల్వే నెట్‌వర్క్ భద్రత మరింత బలోపేతం కానుండగా, రైళ్ల రాకపోకల నిర్వహణలో సమర్థత పెరగనున్నట్లు వివరాలు పూర్తిగా వెల్లడించారు అధికారులు. ముఖ్యంగా తెలంగాణ స్టేజ్-2 నిర్మాణ పనులకు అవసరమైన రవాణా సౌకర్యాలతో పాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కార్యకలాపాలకు వేగవంతమైన అనుసంధానం లభించనుంది. ఆధునిక సిగ్నలింగ్ సాంకేతికతతో ప్రమాదాల నివారణ, రైలు ట్రాఫిక్ సమన్వయం, విశ్వసనీయత పెంపు సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. సురక్షితమైన, సమర్థవంతమైన, అత్యాధునిక మౌలిక వసతుల అభివృద్ధికి ఎన్టీపీసీ కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ విజయవంతమైన కమిషనింగ్ మరోసారి చాటిచెప్పిందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దిన దాత




**కూకట్ పల్లి, జూలై 10(వార్తాప్రభ):**కేపీహెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్ భువన విజయం గ్రౌండ్స్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం, పాఠశాల గదులు సరికొత్త పెయింటింగ్‌తో నూతన శోభను సంతరించుకుంది. గత కొన్ని ఏళ్లుగా రంగులు వెలిసిపోయి వెలవెల బోయిన పాఠశాల పరిస్థితిని చూసిన దాత నర్వ పవన్ కుమార్ చలించిపోయి తన స్వంత ఖర్చులతో పాఠశాల భవనానికి, పాఠశాల ప్రాంగణానికి రంగులు వేయించడంతో పాఠశాల నేడు పెయింటింగ్‌తో నూతన శోభను సంతరించుకుంది. ప్రభుత్వ పాఠశాలను తన సొంత ఖర్చులతో నర్వ పవన్ కుమార్ రంగులు వేయించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ మాట్లాడుతూ రంగులు వెలిసిపోయి వెలవెలబోతున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని చూసిన దాత నర్వ పవన్ కుమార్ ముందుకు వచ్చి పెయింటింగ్ వేయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఆహ్లాదకరంగా, అందంగా మారిన తరగతి గదులను చూసి పిల్లలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. మా విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, వారికి ఇంతటి చక్కని వాతావరణాన్ని బహుమతిగా ఇచ్చిన నర్వ పవన్ కుమార్ కు పాఠశాల తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్ననన్నారు.

## మన ఓట్లను కాపాడుకుందాం

**కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్**



**ఇబ్రహీంపట్నం, జులై 10(వార్తా ప్రభ ప్రతినిధి)**కొండపల్లి ఓటర్లకు ముఖ్యం గమనిక -- జూలై 14 లోగా 'ఎపిక్ ఫార్మ్స్' సమర్పించాలని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ తెలిపారు. కొండపల్లి పురపాలక సంఘం పరిధిలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకోవడానికి తక్షణమే స్పందించాలని అధికారులు కోరారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 52 వేల ఓట్లు ఉన్నాయని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్పైఆర్ సర్వే ప్రకారము ఓటర్లందరూ తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఓటర్లు తమ పోలింగ్ బూత్ పరిధిలోని బిఎల్ఓ ల ద్వారా ఎపిక్ ఫార్మ్స్ తీసుకొని, అందులో సమితి మరియు వ్యక్తిగత వివరాలను పూర్తిగా నింపి, సంబంధిత బిఎల్ఓలకే తిరిగి అందజేయవలెను.ముఖ్య గమనికలు:చివరి తేదీ: పూర్తి చేసిన ఎపిక్ ఫార్మ్‌లను ఈ నెల 14 వ తేదీ లోపల విధిగా సమర్పించవలసి ఉంటుంది.ఓటు కోల్పోయే ప్రమాదం: గడువులోగా ఫార్మ్స్ అందజేయని యెడల, సదరు ఓటరు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. బి ఎల్ వోలు లు ఇంటికి రాని యెడల వెంటనే తమ దగ్గరలోని సచివాలయానికి వెళ్లి ఓటు కార్డును పరిశీలించుకోవాలి. అక్కడ తమ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుసుకుని, ఆ బూత్ బిఎల్ఓను నేరుగా కలిసి ఫార్మ్‌ను సమర్పించవలసిందిగా కోరడమైనది.కావున కొండపల్లి పురపాలక సంఘ పరిధిలోని ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు ముగిసేలోగా తమ ఓటును సురక్షితం చేసుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా కోరారు.

# సంపాదకీయం

## రాయలసీమ.. ఇలా రగలాల్సిందేనా..!

రాయలసీమలో రాజకీయాలు రగులుతున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సీమలోని ప్రతి జిల్లా లోనూ తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఇది ఎవరికి లాభిస్తుంది? ఎవరికి నష్టం చేస్తుంది ? అనే విషయాన్ని పక్కన పెడితే.. ఇలాంటి రాజకీయాలను ప్రజలు ఏమేరకు సహిస్తారన్నది కీలక అంశం. వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య తలెత్తుతున్న వివాదాలు.. చినుకు చినుకు గాలివానలా మారి.. ఉద్రిక్తతలకు.. రగడకు కూడా దారితీసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు రోడ్డున పడ్డాయి. గతానికంటే భిన్నంగా నాయకు ల మధ్య సవాళ్లు-ప్రతిసవాళ్లు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా నాయకులు రోడ్డెక్కుతున్నారు. ఆళ్లగడ్డ, ఆదోని నియోజకవర్గాల్లో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నేతల మధ్య విమర్శలు హద్దులు మీరి ఒకరిపై మరొకరు పైచేయిసాధించుకునే వరకు వెళ్లింది. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రరెడ్డి వర్గీయులు పరస్పరం దాడులు చేసుకునే దాకా ఈ వ్యవహారం సాగుతుండడం గమనార్హం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది. ఈ నియో జకవర్గంలోకి అడుగు పెట్టనిచ్చేది లేదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి.. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అల్టిమేటం ఇవ్వడం.. ఇరు పక్షాల మధ్య రాజకీయాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. తరచుగా వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. పెద్దారెడ్డిపై ఇప్పటికే పలు కేసులు నమోదు కాగా.. జిల్లా బహిష్కరణ చేయాలని జేసీ పట్టుబడుతున్నారు. ఇక, ఇదే జిల్లాలో తాజాగా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజుకు, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి మధ్య వివాదాలు భగ్గుమన్నాయి. తనపై ఆరోపణలు చేశారంటూ రాజు నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలోనే తోపుదుర్తి ఇంట్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసులు నమోదు చేశారు. ఇవి ఎంత దూరం వెళ్తాయో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే పులివర్తి నానీకి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి మధ్య కూడా ఇలానే పరిస్థితి అట్టుడుకుతోంది. పులివర్తి నానీ తీవ్ర ఆరోపణలతో చెవిరెడ్డి కుటుంబానికి సవాల్ రువ్వుతున్నారు. ఇలా.. సీమలోని అన్ని జిల్లాల్లోనూ రాజకీయాలు వేడెక్కా యనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితిని పార్టీలు సర్దుబాటు చేయాలి తప్ప.. చోద్యం చూస్తే.. అది మంచిది కాదన్న అభిప్రాయం నెలకొంది. ఒకవైపు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. మరోవైపు.. ప్రభుత్వం అభివృద్ధి మంత్రం పఠిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో నాయకులు.. సవాళు ,, ప్రతిసవాళ్ల రాజకీయాలతో బిజీబిజీగా గడుపుతున్నారు.

## సంగంలో ఘనంగా మంత్రి ఆనం జన్మదిన వేడుకలు

**టీడీపీ ఆధ్వర్యంలో కేక్ కట్.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



**సంగం జూలై 10 (వార్తాప్రభ ప్రతినిధి)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు సంగం మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి ఆనం ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాణా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆనం నాయకత్వంలో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. రహదారులు తాగునీరు విద్య వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు దేవాదాయ శాఖ మంత్రి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ విశేష సేవలందిస్తున్నారని కొనియాడారు. అదే విధంగా మండలంలోని తలుపురుపాడు గ్రామంలో సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు ఆధ్వర్యంలో మంత్రి ఆనం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు కార్యకర్తలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు టీడీపీ నాయకులు ఖాదర్ బాషా పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ ఓ సీ అందజేత..

**విజయవాడ పశ్చిమజులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని34 వ డివిజన్, ఖుద్దుస్ నగర్ కు చెందిన పాలపర్తి ఇందిర (40) కు ఎం ఎల్ ఏ సుజన చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 3.60 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్ ఓ సీ ను శుక్రవారం, భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీ జే పీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ దాడి అ ప్పా ్ ) రా వ ) మరియు కూటమి నేతలతో కలిసి అందజేశారు.. త్వరి తగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అం దజేసిన ఎమ్మెల్యే సుజన చౌదరి కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.. కూటమి నేతలుకూటమి నేతలు రాధా కృష్ణ, బెన్నా భక్తుల సోమేశ్వరరావు , సుజన మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు ...



## ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి



**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం అయోధ్య నగర్ పరిసర ప్రాంతాలలో లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే



పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు. ప్రతి శుక్రవారం తమ ఇంట్లో మరియు ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు హెల్త్ అసిస్టెంట్ పి.బి. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్ట భంగానికి కొందరు వ్యక్తులు కుట్ర

**కొందరు వ్యక్తులు స్వప్రయోజనాలకై చేస్తున్న అసత్య మరియు నిరాధార ఆరోపణలే**

**విలేకరుల సమావేశంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గం**



**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్ఠ కు భంగం కలిగించే కుట్రలో భాగంగా కొందరు యూనియన్ నిర్వహణ పై పాలకవర్గం పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పాలకవర్గం సభ్యులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు అసత్య ప్రచారాలు తీవ్రంగా ఖండించారు. సమితిలో జరుగు ప్రతి కొనుగోలు ప్రక్రియ పేపరు ప్రకటనతో టెండర్ల విధానంలో మాత్రమే పారదర్శకంగా నిర్వహించబడుతుంది, ఈ విధానంతోనే వీరవల్లి గ్రామం నందు భూ సేకరణ నుండి ఫ్యాక్టరీ నిర్మాణం వరకు జరిగినది మరియు ప్రతి కొనుగోలు పాలకవర్గం మరియు సర్వ సభ్య సమావేశ తీర్మానములతోనే జరిగినది. భావితరాల సంరక్షణ కై నిర్మించిన ఈ ప్లాంట్ ద్వారా నిర్వహణ ఖర్చులు గణనీయముగా తగ్గి పాడి రైతు ప్రయోజనాలను కాపాడటమే కాక, బుడమేరు వరదలలో విజయవాడ ఫ్యాక్టరీ ముంపునకు గురైన సమయములో ఈ ప్లాంట్ పాల సేకరణ లోనూ, విక్రయాలలోను ఎటువంటి భంగం కలగకుండా కాపాడినదని వివరించారు. ప్రాథమిక అంచనా కంటే సుమారు 25 కోట్ల తక్కువ వ్యయంతో నిర్మించబడిన ఈ ప్లాంట్ కై బ్యాంకు నుండి 7 సంవత్సరాల కాల పరిమితి తో తీసుకున్న రూ. 110 కోట్ల ఋణమును కేవలం రెండున్నర సంవత్సరాలలోనే ఆర్థిక క్రమశిక్షణ తో పూర్తిగా చెల్లించడం జరిగిందన్నారు. అలాగే బయట నుంచి కొనే పాలకు ఎటువంటి బోనస్ చెల్లించలేదని పారదర్శక విధానంలోనే కొనుగోళ్ళు జరిగాయని స్పష్టం చేసారు. గత 5 సంవత్సరాలుగా సమితి ఎన్నికల సమయం లోనే ఇటువంటి ఆరోపణలు చేస్తున్న వీరపనేని శివరామప్రసాద్ 2016 నుండి 2021 వరకు సమితిలో నాలుగు బల్క్ మిల్క్ కూలర్ల ద్వారా వ్యాపారం చేసిన దరిమిలా రూ. 6.53 కోట్ల పైగా బాకీ పడ్డారు. సదరు బాకీ ఆయనే కోరుకున్న ఆర్బిట్రేషన్ కోర్టు ద్వారా నిర్ధారించబడినది. సమితికి న్యాయబద్ధంగా చెల్లించవలసిన పై సొమ్ము ఎగవేతకై అయన చేస్తున్న ఈ కుటిలప్రయత్నాలను, వ్యక్తిత్వ హననాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సర్వసభ్య సమావేశపు ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ఆయనపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొనుటకు సంసిద్ధమవుతున్నాము. గతంలో కూడా పలు పర్యాయములు సమితి ఎన్నికలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనడం, సమితి పై దుష్ప్రచారం చేయడం, ఘోర పరాజయం పొందడం వీరపనేని శివరామ ప్రసాద్ కి పరిపాటు. గత ఎన్నికల ప్రక్రియ పై న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఆయన అపీల్ తిరస్కరించబడినది. గత 7 సంవత్సరాలలో పాల మరియు పాల ఉత్పత్తుల విక్రయాలు 370,000 నుండి 600,000 లీటర్ల వరకు పెంచి, వ్యాపార టర్నోవర్ ను 740 కోట్ల నుండి 1300 కోట్లకు చేర్చి, మిగులు నిధులను 96 కోట్ల నుండి 250 కోట్లకు చేర్చి విజయ పథంలో సాగటం కృష్ణా మిల్క్ యూనియన్ ప్రగతికి తార్కాణాలన్నారు. భారతదేశంలోనే అత్యధిక పాల సేకరణ ధరతో పాటు అత్యుత్తమమైన సంక్షేమ కార్యక్రమాలు, ఎక్కడా లేని విధంగా నాలుగు నెలలకు ఒక్కసారి పాడి రైతులకు బోనస్ విధానంతో దేశంలోనే అత్యుత్తమ పాడి సహకార సంస్థగా కృష్ణా మిల్క్ యూనియన్ చేస్తున్న ఈ నిస్వార్ధ పురోగమనాన్ని ఇటువంటి దుష్ప్రచారాలు ఎంతవరకు ఆడుకోలేవని నిర్ద్వందంగా ప్రకటిస్తున్నామన్నారుఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, వేమూరి సాయి వెంకట రమణ , దాసరి వెంకట బలవర్ధనరావు , వుయ్యూరు అంజి రెడ్డి , బొట్టు రామచంద్రరావు , నెలకుదిటి నాగేశ్వరరావు , శ్రీమతి నెక్కలపు వాణిశ్రీ , శ్రీమతి శనగల వెంకట శివ జ్యోతి , శ్రీమతి మద్దుకూరి వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఔదార్యం

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాలతో లేబర్ కాలనీలో ఇటీవల గుండెపోటుతో మరణించిన ముడికొండ వెంకటేశ్వరరావుకుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. నిరుపేద అయినటువంటి ముడికొండ వెంకటేశ్వరరావు(67) ఇస్త్రీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు , దురదృష్టవశాత్తు గుండెపోటుతో మరణించాడు..విషయం తెలుసుకున్న ఎం ఎల్ ఏ సుజన చౌదరి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని తక్షణమే తమ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎం ఎల్ ఏ ఆదేశాలతో సుజన మిత్రా కోఆర్డినేటర్లు శుక్రవారం లేబర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ 5000 వేలు ఆర్థిక సాయం అందించారు..సాయం అందించిన ఎం ఎల్ ఏ సుజన కు బాధిత కుటుంబ సభ్యులు



కృతజ్ఞతలు తెలిపారు....

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత ..



**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎం ఎల్ ఏ సుజన చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను కూటమి నేతలు ఎన్డీయే కార్యాలయంలో అందజేశారు . 47వ డివిజన్ , జొన్నల గడ్డ మస్తాన్ వీధికి చెందిన కే రాధ (45) ఎండోస్కోపిక్ మయోటమి తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో ఎన్డీయే కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4 లక్షల70 వేల విలువైన ఎల్ ఓ సీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు..త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతలు ధనేకుల వెంకట సుబ్బారావు, నాగోతి రామారావు, వెంపలి గౌరీ శంకర్, ప్రభు చరణ్ పాల్గొన్నారు..

## సాతులూరు రైతులు స్వచ్ఛందంగా మురుగు కాలువకు తూముల ఏర్పాటు...



**కృత్తివెన్ను జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**సాతులూరు గ్రామంలో మాలకోడు మురుకు డ్రైన్ వద్ద గత నాలుగు సంవత్సరాలుగా తూములు పాడైపోయి మురుగునీరు వెళ్ళక రైతులు పంటను నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు నాయకులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా తూములను ఏర్పాటు చేసుకున్నారు. మురుగు కాలువ కూ తూములు ఇచ్చిన రైతులువక్కల గడ్డ కరుణ్ కుమార్ చోడవరపు రాధాకృష్ణ కంతమనేని మురళి అర్తమూరు ఏకన్న అత్తమూరు పోలీసు అన్నదమ్ములు ఒక్కొక్కరు ఒకటి లెక్కన ఇచ్చారు. ఆ మురుగు కాలువను ఉపయోగించుకునే సన్న చిన్న కారు రైతులు వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం డీసీ చైర్మన్ బొర్రా కాశి మరియు కంఠంనేని మురళి పర్యవేక్షణలో నిర్వహించారు...

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జులై 6, 2026న నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన దరఖాస్తుల పరిష్కారంపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సాయంత్రం శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిషనర్ ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖాధిపతులు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సమస్యల ప్రస్తుత స్థితి, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిష్కారమైన దరఖాస్తుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు, దరఖాస్తుదారులకు తీసుకున్న చర్యలను తెలియజేసి వారి సంతృప్తిని నిర్ధారించాలన్నారు. ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా అనేక మంది అధికారులు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా (ఏఈఆర్వోలు) ఎన్నికల విధులు నిర్వహిస్తున్నప్పటికీ, అదే సమయంలో ప్రజలకు అందించాల్సిన పౌర సేవలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు విశేష స్పందన





**విజయవాడ పశ్చిమ జులై 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఎం ఎల్ ఏ సుజన చౌదరి ,భవానిపురం, ఎన్డీఏ కార్యాలయంలో నిరంతరం ప్రజా దర్బార్ లను నిర్వహిస్తున్నారు..ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాల మేరకు కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి శుక్రవారం భవానీపురం, ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించిందిపశ్చిమ ప్రజలు తమ వినతులను రేషన్ కార్డులు,పింఛన్లు, తాగునీరు, ఇళ్ల స్థలాలు,వైద్య సహాయం వంటి తదితర సమస్యలపై దరఖాస్తు రూపంలో అందజేశారు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, పెద్ద సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజన చౌదరి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి తెలిపారు. కూటమి నేతలు మైలవరపు దుర్గారావు, నంద కుమారి,దాడి అప్పారావు, ప్రదీప్ రాజ్, బెన్నా భక్తుల సోమేశ్వరరావు , జయ బాలన్, పట్నాల హరి బాబు తదితరులు పాల్గొన్నారు...

### చేజర్ల లో ఘనంగా ఆనం జన్మదిన వేడుకలు



**చేజర్ల జూలై 10 (వార్తాప్రభ)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి 75వ జన్మదినం పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సూచనలతో చేజర్ల లో ఘనంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మొదటగా బస్టాండ్ సెంటర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహం దగ్గర తెలుగుదేశం పార్టీ నాయకులు అందరూ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి ఆనం కి ఆయుస్సు ఆరోగ్యం కీర్తి ప్రతిష్టలు భవిష్యత్తు లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రార్థించారు. అనంతరం స్వీట్లు పంచి బాణా సంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు టిడిపి చేజర్ల మండల అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ సొసైటీ అధ్యక్షులు బూదళ్ళ వీర రాఘవ రెడ్డి మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్ తదితర సీనియర్ నాయకులు మరియు ఆనం అభిమానులు పాల్గొన్నారు.

## ధైర్యమే ఉండాలి!



ధైర్యమే ఆయుధము
పెంచుకుంటే లాభము
విజయాల సాధనకు
అదే కదా మార్గము
చేయాలి సాహసము
జీవితమిక అద్భుతము
ఏది కూడా వట్టిగా
సాధించలేముగా
తెగువనే చూపాలి
శక్తిలా లేవాలి
నలుగురికి స్ఫూర్తిగా
బ్రతకాలి గొప్పగా
చరిత్ర సృష్టించాలి
మంచి పేరు రావాలి
చేతలే మంచిగా
ఉంటే ఘనతేగా

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ప్రజా ప్రతినిధులా లేక వీధి రౌడీ లా..?

**ప్రజాప్రతినిధులను కట్టడి చేయండి.**

**జిల్లా ఎస్పీకి డాక్టర్ పోతుల నాగరాజు విజ్ఞప్తి**

**అనంతపురం, జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):** ఉమ్మడి అనంతపురం జిల్లా లోని ప్రజా ప్రతినిధులు అనంతపురం నగరం లో ముఠా లుగా ఏర్పడి దాడులు చేసుకోవాడానికి సిద్ధ పడి ఒకరి మీద ఒకరు ఛాలెంజ్ చేయడం సిగ్గుచేటు అని బిసి రిజర్వేషన్ల పోరాట వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు పేర్కొన్నారు.వీరు ఎప్పుడైనా ప్రజల సంక్షేమము కోసం, అభివృద్ధి కోసం, శాంతి భద్రతల కోసం, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వసతుల కోసం, ప్రభుత్వ పాఠశాలలో వసతుల కోసం, సంక్షేమ హాస్టల్ లలో విద్యార్థుల దుస్థితి గురించి గాని, కల్తీ ఆహారం అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడే బాధ్యత తీసుకొని, ప్రజలకు ఎప్పుడైనా మార్గదర్శకంగా ఉన్నారా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కానీ వీరే వీధి రౌడీ ల మాదిరిగా ప్రవర్తిస్తే ఇక ప్రజలకు దిక్కు ఎవరు?అని ప్రశ్నించారు వీరి రాజకీయ ఆధిపత్యం కోసం, వీరి సొంత ఆస్తులను కూడబెట్టు కోవడం కోసం, జిల్లాలో



ప్రభుత్వ భూములను, ప్రకృతి సంపద లో ఆక్రమాల కోసం, ప్రజలను పార్టీ ల పరంగా, కులాల పరంగా విడగొట్టి ఒకరి మీద ఒకరు దాడులు చేసుకొనడానికి వీరే ముందు ఉండి మీడియా లోను, సోషల్ మీడియా లోను ప్రకటనలు ఇస్తూ ఉంటే, వీరికి చట్టాలు వర్తించవా? అన్నారు.వీరు ప్రజలచే ఎన్ను కొబడిన ప్రజాప్రతినిధులా లేక నియంతలా...? ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారనీ డా.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు.వీరి వ్యవహారం వలన జిల్లాలో పోలీస్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారనీ,ఇతర డిపార్ట్మెంట్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారనీ, ప్రజల పరిస్థితి చాలా దయనీయంగా తయారు అయ్యిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో జిల్లా పోలీస్ అధికారిగా మీరు సమాజంలో ఎవరు శాంతి భద్రత లకు విఘాతం కలిగించిన చట్ట పరమైన చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా పోలీస్ సిబ్బంది స్వేచ్ఛగా పని చెసే విదంగా కృషి చేయాలని ఎస్పీని కోరారు. ముందుగా జిల్లా లోని ప్రజా ప్రతినిధులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి ద్వారా కోరుతున్నామని,జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందుగా అన్ని పార్టీల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు సరైన కౌన్సింగ్ ఇవ్వాలని, డాక్టర్ పోతుల నాగరాజు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

## మచిలీపట్నం రైతు బజారు సమీపాన ఆవు ఢీకొని మహిళకు గాయాలు.

**సీఐ ఏసుబాబు స్పందించి కుటుంబ సభ్యులకు సమాచారం.**



**మచిలీపట్నం జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**స్థానిక రైతు బజారు సమీపాన శుక్రవారం జరిగిన ఓ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చిన ఆవు ఢీకొట్టడంతో ఆమె వాహనంతో పాటు కిందపడిపోయింది. ఈ ఘటనలో మహిళకు గాయాలయ్యాయి.అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆర్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏసుబాబు ఘటనను గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన మహిళకు ప్రాథమిక సహాయం అందించి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు.రాబర్ట్ సన్ పేట సీఐ ఏసుబాబు చూపిన మానవతా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల కారణంగా తరచూ నగరంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశు నియంత్రణకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..

## 'రంగా.. రంగా.. పాండురంగా' నామస్మరణతో మార్మోగిన సంగం

**శివాజీ సెంటర్ తూర్పు వీధిలో వైభవంగా పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవం**





**సంగం జూలై 10 (వార్తాప్రభ ప్రతినిధి)** మండల కేంద్రంలోని శివాజీ సెంటర్ తూర్పు వీధిలో శ్రీ పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.గురువు సీతారామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పండరి భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గురువుల ఆధ్యాత్మిక గానాలతో ఆలయ పరిసరాలు మార్మోగగా భక్తులు 'రంగా... రంగా... పాండురంగా' అంటూ నామస్మరణ చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు భక్తి పారవశ్యంలో అగ్నిగుండం తొక్కి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ప్రజలు తరలివచ్చారు.ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగింది.

## ఎస్ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం

**పాల్గొన్న నిపుణులైన వైద్యులు.**

**మచిలీపట్నం జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**విజయవాడ అమరావతి మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వారి అవగాహనా సదస్సు. రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ ఆంజనేయులు అధ్యక్షతన స్థానిక ఎస్ ఎస్ ఆర్ ప్రైమ్ ఫంక్షన్ హాల్ నందు జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్ ఎండి. డాక్టర్ కర్నాటి రాజేంద్ర కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్ వి ఎస్ రవి తేజశ్వరరావు ఎమ్మెస్ ఆర్థో, డాక్టర్జంపని చంద్ర ఎమ్మెస్ జనరల్ సర్జన్ వారి వారి నైపుణ్యాలలో సుమారు 200 మంది గ్రామీణ వైద్యులకు వారి నైపుణ్యాలలో అవగాహనా శిక్షణ ఇచ్చారు. అలాగే అమరావతి హాస్పిటల్ లో అందుబాటులో ఉండే అతి తక్కువ ఫీజులతో పేదలకు, మధ్య తరగతి వారికి అందుబాటులో కూడా వైద్య సదుపాయాలు అందుతాయన్నారు.ఈ సదస్సు లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ ఆంజనేయులు, నందగోపాల్, డేవిడ్ రాజు, జవహర్ పీటర్, హరి ప్రసాద్, పిఎస్ఐ ఖాన్, వాసుదేవ మూర్తి,రత్తయ్య



రాజారత్నం సందీప్ కుమార్ దుర్గా రావు అర్జున్ రావు గంబీరపు కోటేశ్వరరావు, వక్కల గడ్డ జయ సాయి, నాగపోతరావు, వీర భద్ర రావు, నక్క రాజ్య లక్ష్మి, మేరీ కుమారి సునీత తదితరులు ఉన్నారు.

## యార్లగడ్డ ఆదేశాల మేరకు వాటర్ ట్యాంకుల క్లీనింగ్



**గన్నవరం, జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల వాటర్ ట్యాంకులను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గన్నవరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గల సురక్షిత తాగు నీటి పథకాల వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల అధికారులు నీటి ట్యాంకులను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని వాటర్ ట్యాంకును గురువారం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గన్నవరం మండలం అల్లాపురం గ్రామంలోని పంచాయతీ ద్వారా తాగునీటిని సరఫరా చేసే వాలు వద్ద మురుగునీరు పేరుకుపోవటాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించినా ఆయన తక్షణమే శుభ్రం చేయాలని, గ్రామంలోని డ్రైనేజీలు క్లీన్ చేయాలనీ ఆదేశించారు. గురువారం సదరు వాటర్ పిట్ ను శుభ్రం చేయించిన అధికారులు, గ్రామంలోని కచ్చా డ్రైన్లు శుభ్రం చేసేందుకు నివాసితులకు నోటీసులు జారీ చేశారు. కాగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్వో ప్లాంట్లలో అధికారులు తనిఖీలు చేసి నీటి నాణ్యత పరీక్షలు చేయించి పలు ప్లాంట్లలో ఫిల్టర్లను మార్పించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

# సమిష్టి కృషితో వరిసాగు సఫలం చేద్దాం.

**● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్. ● మోపిదేవి వార్పు వద్ద పూజలు చేసి ఆక్విడెక్టు ద్వారా దివిసీమకు సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే. ● ఎల్-నీనో నేపథ్యంలో పట్టిసీమ, పులిచింతల ఆధారంగా నిలుస్తాయి: ఎమ్మెల్యే.**





**మోపిదేవి: అవనిగడ్డ:(వార్తాప్రభ ప్రతినిధి)** సమిష్టి కృషితో ఈ ఏడాది వరిసాగు సఫలం చేద్దామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మోపిదేవి వార్పు వద్ద దివిసీమకు సాగునీటి విడుదల కార్యక్రమం జరిగింది. ఆక్విడెక్ట్ ఎల్ఎఫ్ఆర్ వద్ద ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి గేట్లు ఎత్తి ఆక్విడెక్టుకు నీటిని విడుదల చేశారు. దివిసీమకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మకు పూజలు చేసి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తొలి ఏడాది సాగునీటి విడుదలకు వచ్చిన సమయంలో ఆక్విడెక్టు షట్టర్లు పైకి లేవని పరిస్థితిలో ఉన్నాయన్నారు. చిల్లులు పడి నీరు పోతూ ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రూ.కోటి 10లక్షలతో సమగ్ర మరమ్మత్తులు చేయిస్తే రంగులు వేశారని విమర్శించారన్నారు. వైసీపీ హయాంలో ఆ రంగులు కూడా వేయలేదన్నారు. ఆక్విడెక్టుకు రంగులు మాత్రమే కాదు కింద కీలకమైన 140లాక్ చాంబర్లు బాగు చేసి పటిష్టమైన డోర్లు ఏర్పాటు చేయించామన్నారు. దివిసీమలోని 70వేల ఎకరాలకు సాగునీరు అందించే ఆక్విడెక్టుకు లీకులు అరికట్టి, ఎల్ఎఫ్ఆర్, ఆర్ఎఫ్ఆర్ షటర్లు, సర్ ప్లస్ షటర్లు నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల వైసిపి హయాంలో కనీస మరమ్మత్తులు కూడా చేయకుండా జల వనరుల శాఖను నిర్వీర్యం చేయడం దురదృష్టకరం అన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అనేక పంట కాలువలకు నూతన షటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని వేధిస్తున్న ఎల్-నీనో నేపథ్యంలో రైతులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దని పిలుపునిచ్చారు. గతంలో కృష్ణ డెల్టా ఉద్యమ సమయంలో, కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తాను అధికార పార్టీలో ఉన్నప్పటికీ పదవి కంటే ప్రజలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి, రైతు పక్షాన ఉద్యమాలు చేపట్టి రైతులకు అండగా నిలిచినట్లు తెలిపారు. గతంలో అనేక మార్లు గడ్డు పరిస్థితి ఎదురైన సమయంలో నియోజకవర్గ రైతులు ప్రణాళికతో తక్కువ నీటితో ఎక్కువ పంట పండించారన్నారు. తాజా పరిస్థితి గురించి శాస్త్రవేత్తల సూచనలు నేపథ్యంలో గ్రామాల్లో నీటి సంఘాల అధ్యక్షులు సాగునీటిని బాధ్యతగా ప్రతి ఎకరానికి చేర్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ అంశంలో తాను, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు నిరంతర పర్యవేక్షణతో వరి సాగు సఫలమయ్యేలా సహకరిస్తామని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యర్యం కోల్పోవద్దని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో అవనిగడ్డ నియోజకవర్గంలో ఐదుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఆ సమయంలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్ రైతులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టు ఆ ఏడాది ఎదురైన నీటి కష్టాలు తీర్చిందన్నారు. తాను నిర్వహించిన కృష్ణా డెల్టా ఉద్యమ ఫలితంగా నిర్మితమైన పులిచింతల ప్రాజెక్టు, పట్టిసీమ ప్రాజెక్టు ఈ ఏడాది రైతులకు కొంతమేర భరోసా ఇచ్చే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, డీసీ చైర్మన్లు నిడమానూరు దిలీప్ కుమార్, అయినంపూడి భాను, బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు), ఎంపీపీ తుంగల సుమతి, ఇరిగేషన్ ఈఈ రావెళ్ళ రవికిరణ్, డీఈఈ బీబీఎస్ గణపతి, తహసీల్దార్ కే.భవాని, జలవనరుల శాఖ ఏఈఈలు పొన్నూరు రవితేజ, వీ.ఎన్.వీ రాంకుమార్, డీ.విజయ్ కుమార్, తానేటి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 11కేవీ పురుషోత్తపట్నం ఫీడర్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా (11-07-26) శనివారం ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ డి. విశ్వేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపు గూడెం, ముదిరాజుపాలెం, కట్టుబడిపాలెం,గ్రామాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు,పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు వ్యవసాయ కరెంటు ఉదయం 5 గంటల నుంచి 08:00 వరకు మరియు 12:00 నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు ఉంటుందనీ గమనించాలని కోరారు.

## మెగా జాబ్ మేళా ను యువత సద్వినిగం చేసుకోవాలి

**రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్**



**ఇబ్రహీంపట్నం, జులై 10(వార్తా ప్రభ ప్రతినిధి):**రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క ముస్లిం మైనారిటీ యువతీ యువకులు పాల్గొని ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్ తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ 11 వ తారీకు శనివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కాన నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ చిన్ని, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ర పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా ను ఉమ్మడి కృష్ణా జిల్లా ఉమ్మడి గుంటూరు జిల్లా నిరుద్యోగ ముస్లిం మైనారిటీ యువకులు 60 నుంచి 70 కంపెనీలు వస్తున్న సందర్భంగా ఈ అవకాశాన్ని వినియోగించుకొ కోవాల్సిందిగా ఎస్ ఎం ఫైజాన్ తమ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేయడం జరిగింది. మన సమాజంలో పదవ తరగతి నుండి ఇంటర్ డిగ్రీ వరకు చదువుకున్న ఎంతోమంది పేద ముస్లిం యువకులు యువకులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సందర్భంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముస్లిం మైనారిటీ కుటుంబాలకు అండగా ఉండటం కోసం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఈ గొప్ప అవకాశాన్ని మనకు అందిస్తున్నారని ఫైజాన్ తెలియజేశారు.

# జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలి:

**జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి**



**అమలాపురం జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**రూ. 1,650 కోట్లతో గోదావరి సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు నిర్దేశిత గడువు?ఏప్రిల్ 2027 నాటికి జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా త్రాగునీటి సరఫరా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి సంబంధిత శాఖల ఇంజనీర్లు ఆదేశించారు. కలెక్టరేట్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జల జీవన్ మిషన్ కింద డాక్టర్ .బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా పైప్ లైన్ ద్వారా సురక్షిత త్రాగునీరు ప్రతిపాదించిన వాటర్ గ్రిడ్ పథక నిర్మాణ పనులు?ఇప్పటివరకు 25 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాటర్ గ్రిడ్ నిర్మాణ పనుల స్థితిగతులను సంబంధిత మెగా ఇంజనీరింగ్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జలవనరుల శాఖలు ఇంజనీర్లు పైప్ లైన్ ఏర్పాటులో రోడ్లు వెంబడి కాలువలలో పైప్లైన్ ఏర్పాట్లు పూర్తిగా సహకరించాలని కోరారు. అదేవిధంగా రోడ్డు కటింగ్ లు వంటి అంశాలను పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వివిధ రకాల అనుమతులు ఎప్పటికప్పుడు తీసుకుని నిర్మాణ పనులను నిర్దేశిత గడువు లోపల పూర్తి చేయాల న్నారు. డాక్టర్ .బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా సురక్షిత త్రాగునీరు సరఫరా చేసేందుకు ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన రూ. 1,650 కోట్ల గోదావరి సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్' పథకం నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని వైఖోం నైదియా దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మెగా త్రాగు నీటి ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ పైప్‌లైన్ల ద్వారా స్వచ్ఛమైన త్రాగు నీరు అందుతుందని తెలిపారు. కాలువలు, ప్రధాన రహదారుల వెంబడి పైప్‌లైన్లు ఏర్పాటు చేసే ప్రక్రియలో వివిధ శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని స్పష్టం చేశారు. ఆయా శాఖల నుంచి రావలసిన అనుమతుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఎక్కడా పనులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. రాబోయే కాలంలో పనుల వేగాన్ని రెట్టింపు చేయాలని కాంట్రాక్ట్ సంస్థలను, పర్యవేక్షక అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి, జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా త్రాగు నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

## రావణ్ కస్టడీ పిటిషన్ విచారణ ఈ నెల 14కి వాయిదా

**గన్నవరం కోర్టులో రావణ్ తరఫున వైకాపా లీగల్ సెల్ హాజరు**



**గన్నవరం, జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):**సోషల్ మీడియా కామెంట్ల కేసులో అరెస్టు అయిన రావణ్ కస్టడీ పిటిషన్ పై విచారణను గన్నవరం కోర్టు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది.రావణ్ ను 7 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై శుక్రవారం గన్నవరం కోర్టులో విచారణ జరిగింది.విచారణ సందర్భంగా రావణ్ తరఫున వైకాపా లీగల్ సెల్ ప్రతినిధులు పొన్నవోలు సుధాకర్, ఓ.గవాస్కర్, తిరువీధి వెంకయ్య కోర్టుకు హాజరయ్యారు.అయితే ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాదులు కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయాధికారి పిటిషన్ విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు.

## ఇంటర్న్ స్టంప్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం



**రెడ్డిగూడెం జులై 10(వార్తాప్రభ ప్రతినిధి ):** ఇంటర్న్ స్టంప్ కంపెనీ 5 వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ వృద్ధుల డేకేర్ సెంటర్ "నందు నిరుపేదలైన వారికి ప్రేమవిందు (అన్నదానం) నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీ వార్షికోత్సవం సందర్భంగా నిరుపేదలైన వారికి ఇలా అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్ స్టంప్ కంపెనీ డైరెక్టర్స్ సాయి గుప్తా, మీనాక్షి మరియు వైస్ ప్రెసిడెంట్ శుభాని, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు చాట్ల విజయకుమార్, కార్యదర్శి హన్న తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనం జయంతిన దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు



**అనుమసముద్రంపేట జూలై 10 (వార్తాప్రభ ప్రతినిధి)** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా మండల టిడిపి నేతలు కార్యకర్తలు అభిమా నులు మండల కేంద్రమైన ఏఎస్పేట లోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూల దుప్పట్లు గలేపు వస్త్రాలు తీసుకొని దర్గాకు చేరుకున్నారు ఈ సందర్భంగా దర్గా లోపల ఉన్న శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మల సమాధులపై గలేపు వస్త్రాలు పూల దుప్పట్లు కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలకు మరింత సేవ చేసే విధంగా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు మండల టిడిపి ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్ రెడ్డి రాజవోలు సొసైటీ అధ్యక్షులు కే నరసింహా రెడ్డి జిల్లా మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాలాద్రి నాయుడు చీర మన మాజీ సర్పంచ్ కంచర్ల శ్రీహరి నాయుడు నాయకులు షేక్ జిలాని భాష షేక్ షబ్బీర్ షేక్ ఖాదర్ బాషా షేక్ ఖాజా మియా సురేష్ పైడి శ్రీనివాసులు మాలకొండ రెడ్డి నరసయ్య అనిల్ మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**-శాసనసభ్యులు అరికపూడి గాంధీ**




**శేరిలింగంపల్లి,జూలై 10 (వార్తాప్రభ):** ఫ్రైడే--డ్రైడే కార్యక్రమంలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్‌లో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ నివాసంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ,డీసీ శ్రీమతి చాముండేశ్వరి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ఫ్రైడే--డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. దోమల నివారణ,పరిసరాల పరిశుభ్రత కోసం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటిని ప్రత్యక్షంగా పరిశీలించి తొలగించడం ద్వారా మలేరియా,డెంగ్యూ, చికెన్‌గున్యా,కలరా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, కుండలు,పాత టైర్లు,బకెట్లు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా స్థలాలు ఆక్రమణలు లేకుండా పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి

**- జోనల్ కమిషనర్**



**శేరిలింగంపల్లి,జూలై 10 (వార్తాప్రభ):** గచ్చిబౌలి డీఎల్ఎఫ్ ప్రాంతంలో ప్రజా స్థలాలను స్వాధీనం చేసుకుని,పాదచారులు ,వాహనదారులకు సౌకర్యవంతమైన రాకపోకల కోసం సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమ నిర్మాణాలు,అడ్డంకులను తొలగించారు. ప్రజా స్థలాలను ఆక్రమణలు లేకుండా పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కృత్తివెన్ను జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):** మునిపెడ గ్రామానికి చెందిన శివకోటి వెంకటేశ్వరరావు ఈమధ్య అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొందారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆయనకు 70916 రూపాయల చెక్కును మాజీ నీటి సంఘం అధ్యక్షుడు దాసరి ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ నివాసంలో వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శివకోటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కూ, సహకరించిన దాసరి ఆదినారాయణ కు కృతజ్ఞతలు తెలియజేశారు....

# 12వ రోజుకు చేరిన సిఎంఓఏఐ రిలే నిరాహార దీక్షలు!!

**● కోల్ ఇండియాతో సమాన వేతనాల కోసం అధికారుల ఉద్యమం ఉధృతం ● డిమాండ్లు నెరవేరే వరకు దీక్షలు విరమించబోమన్న ఆఫీసర్స్ ● ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట అధికారుల నిరసన కొనసాగింపు ● పీఆర్‌పీ బకాయిల విడుదల కోరుతూ సింగరేణి అధికారుల ఆందోళన**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 10 (వార్తాప్రభ):** సింగరేణి కాలరీస్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 12వ రోజుకు చేరుకున్నాయి. కోల్ ఇండియా అధికారులతో సమానంగా పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వివిధ అలవెన్సులను అమలు చేయాలని కోరుతూ అధికారులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. నేటి దీక్షలో డీజీఎం జి. గితేందర్, డీజీఎం డేవిడ్, డిప్యూటీ ఎస్‌హెచ్‌జీ రావుల రమేష్, డిప్యూటీ ఎస్ఈ అన్వేష్, సీనియర్ యూఎంజీఆర్ భరత్, మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రశాంత్, సర్వే ఆఫీసర్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, 12 రోజులుగా అన్ని కేడర్ల అధికారులు క్రమం తప్పకుండా రిలే దీక్షల్లో పాల్గొంటున్నప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ ఇండియా అధికారులకు అమలవుతున్న వేతన, భత్యాల ప్రయోజనాలు సింగరేణి అధికారులకు కూడా సమానంగా వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన హామీ లభించే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరానికి వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం ప్రకటిస్తూ ఉద్యమానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. అధికారులు ఐక్యంగా సాగిస్తున్న ఈ ఆందోళన సింగరేణిలో మరింత ఉధృతమవుతున్నట్లు కనిపిస్తోంది.

# ఆరోగ్యంగా జీవించే హక్కును గుర్తించి శాశ్వతంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డును తొలగించాలి.

**● జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రమాద తీవ్రతపట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రకుమార్ వ్యాఖ్య. ● బాలాజీనగర్ లోగల అంబేద్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలల సమర్పణ. ● -జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి కో కన్వీనర్ అధ్యక్షతన జరిగిన పాదయాత్ర.**






**జవహర్ నగర్, జూలై 10:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు యాజమాన్యం నిభంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో చట్టపరమైన చర్యలు చేపట్టి, పర్యావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేసిస్తున్న ఆందోళనలు, సూచనలను పరిగణనలోకి, ఆరోగ్యంగా జీవించే హక్కును గుర్తించి, శాశ్వతంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగించాలని మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్నికి సూచించారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణలో బాగంగా ఇక్కడి డంపింగ్ యార్డు బాధిత ప్రాంతాల ప్రజలకు కూడ వర్తిస్తాయని గుర్తుచేశారు. ఇక్కడ నివసిస్తున్న లక్షలాది ప్రజలతోపాటు సకల జీవరాశుల మనుగడను దెబ్బతీయడం రాజ్యాంగ స్పూర్తికి విఘాతం అని అన్నారు. 2026, జూలై-10న శుక్రవారం రోజు కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల శాంతినగర్, వై.యస్.ఆర్.నగర్ ప్రాంతాల్లో జరిగిన పాదయాత్రను ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రకుమార్ ప్రారంభించారు. అంతకు ముందు బాలాజీనగర్ లోగల అంబేద్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల జీవించే హక్కులో బాగంగా, ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ కొరకు ఉద్యమిస్తున్న సామాజిక ఉద్యమ సంస్థలకు ప్రజలు, ప్రజాస్వామిక మేదావులు అండగా నిలబడాలని కోరారు. ఈ పోరాటం ఏ ఒక్కరిది కాదని, రాజ్యాంగ బద్దంగా ఇక్కడి బాధిత ప్రాంత ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కుల కొరకు నిరసనలు, ఆందోళనలు తెలియజేసే హక్కులు ఉన్నాయనిఉద్ఘాటించారు. మాజీమంత్రి ప్రజాప్రతినిధి, పోరాటకమిటి కో కన్వీనర్ ఏ.సుబ్రమణ్యం అధ్యక్షణ జరిగిన కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు., పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, సిపిఐ, పోరాట కమిటీ కన్వీనర్ ఉమామహేష్, గౌరవ సలహాదారుడు, మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మ గౌడ్, కో కన్వీనర్స్ సిపిఎం శివన్నారాయణ, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గద్దం సదానందం, టిఆర్ఎస్- జాగృతి మేక లలిత యాదవ్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, పికెఎం డి.జాన్, బహుజనసత్త సింగరయ్య గౌడ్, టీజేఏసీ బద్రగామ ఆంజనేయులు, పిఓడబ్ల్యూ (విముక్తి)పెర్క సునీత, టియుసిఐ వి.ప్రవీణ్, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, సిపిఐ టి.శంకర్, పిడిఎం చంద్రమౌళి, ఏ.ఐ.ఎఫ్.టి.యు.వై మల్లేష్, మరియు కమిటీ సభ్యులు పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీ బాయి, జయసుధ, బాధ్యత. ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకన్న, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, ఫాతిమా, బండ్లగూడ ఎం సురేందర్, యాప్రాల్ చైర్మన్ రాజానర్సింహ్మ, ప్రజాకళాకారుడు వెంకటాచారి, టియుజేఏసి కళాకారిణి తుమ్మరాణి, న్యూడెమోక్రసీ అరుణ, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ఈస్ట్ నందమూరి నగర్ గుండెరాజు, జర్నలిస్ట్ కొన్నెవేణు, చికెన్ యాదగిరి తదితరులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు

**- మూలపాడు వీఆర్వో నరేంద్ర కూడా..**




**ఇబ్రహీంపట్నం, జూలై 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, మూలపాడు వీఆర్వో నరేంద్రలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి పై కలెక్టర్ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తుంది. ఇందులో రూ.లక్షలు తీసుకుని ఎఫ్ఎంసీలు మంజూరు చేస్తున్నారని, మూలపాడు వీఆర్వో నరేంద్రతో కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు కథనం వచ్చింది. అంతేకాకుండా వాస్తవాలు, రికార్డులు సరిగా ధ్రువీకరించకుండా కొటికలపూడిలో ఓ మహిళకు అనుకూలంగా ఎఫ్ఎంసీ జారీ చేశారు. దీనిపై మృతుడి రెండో భార్య పిటిషన్ తో పరిశీలించిన కలెక్టర్ ఆ ఎఫ్ఎంసీని రద్దు చేశారు. విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా యంత్రాంగం జారీ చేసిన నిర్దిష్ట ఆదేశాలు ఉన్నప్పటికీ త్రిలోచనపురంలోని ఆర్ఎస్ నెంబర్ 79కి చెందిన భూమి అడంగల్ రికార్డులను సరిదిద్దడానికి తగు చర్యలు తీసుకోలేదు. పునః సర్వే ప్రక్రియలో కూడా తహసీల్దార్ ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోస్ట్ మాస్టర్ మనోజ్ కేసులో రెవెన్యూ రికవరీ చట్టం నిబంధనల ప్రకారం ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంలో తహసీల్దార్ విఫలమయ్యారు. మ్యుటేషన్ దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి, ఇతర రెవెన్యూ సంబంధిత సేవల కోసం తహసీల్దార్ లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ పలువురు పిటిషనర్లు ఫిర్యాదులు అందజేశారు. ఇబ్రహీంపట్నంలోని ఆర్ఎస్ నెంబర్ 230/1లో న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమిని వాణిజ్య ప్రయోజనాల కోసం నిర్మాణం, లీజుకు ఇవ్వడానికి అనుమతి ఇచ్చినందుకు తహసీల్దార్ భారీ మొత్తంలో ముడుపులు డిమాండ్ చేశారని కలెక్టర్ కు ఫిర్యాదు అందింది. అలాగే ప్రతి పనికి రేటు ఫిక్స్ చేసి వసూళ్లు చేస్తున్నారని, ఆంధ్రప్రభలో కథనం ప్రచురితమవడంతో పాటు పీజీఆర్ఎస్ లో ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందాయి. వీటన్నింటిపై కలెక్టర్ లక్ష్మీశ విచారణ చేయించారు. విచారణలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వో నరేంద్ర అధికారిక విధులను నిజాయితీ, శ్రద్ధ, కర్తవ్య నిబద్ధతతో నిర్వర్తించడంలో ప్రాథమికంగా విఫలమైనట్లు స్పష్టమైంది. దీంతో తహసీల్దారు వెంకటేశ్వర్లు, వీఆర్వో నరేంద్రలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు

# మరో నాలుగు రోజులు మాత్రమే సర్!

**- ఓటర్లు త్వరితగతిన ఫారాలు బీఎల్‌వోలకు అందజేయండి- క్షేత్రస్థాయిలో సదా ఓటర్ల సేవలో బీఎల్‌వోలు, అధికారులు అందుబాటులో- ఈ నెల 11, 12 తేదీల్లో సర్ ప్రత్యేక శిబిరాలు - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూలై 10: (వార్తా ప్రభ (ప్రతినిధి):** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని, ఓటర్లు త్వరితగతిన ఫారాలు అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ కోరారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 11, 12 తేదీల్లో (రెండవ శనివారం, ఆదివారం) జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డిజిటైజేషన్ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), పర్యవేక్షక అధికారులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఓటర్ల ఈఎఫ్ డిజిటైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం సర్ ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమని పేర్కొంటూ, సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాలను సమర వంతంగా నిర్వహించి, ప్రతి ఫారాన్ని సకాలంలో డిజిటైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాలను విజయవంతం చేసేందుకు అధికార య ంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఇంకా ఎవరికైనా ఫారం అందకపోయినా, సమర్పించకపోయినా, మ్యాప్ కాకపోయినా ప్రత్యేకంగా దృష్టిసారించి నిబద్ధతతో కార్యకలాపాలను పూర్తిచేయాలని ఆదేశించారు.

# తెలంగాణ వ్యాప్తంగా... విద్యా సంస్థల బంద్ విజయవంతం

**సహకరించిన విద్యాసంస్థలకు ఎస్ఎఫ్ఐ కృతజ్ఞతలు**



**జవహర్ నగర్, జూలై 10: (వార్తా ప్రభ)** ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో, వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల బంద్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని పలు మండలాల్లో విజయవంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడంతో విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి బలమైన సందేశం వెళ్లిందని ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలికి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న ఫీజులను నియంత్రించేందుకు ఫీజు రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో27 వేల ప్రభుత్వ పాఠశాలలను సుమారు 4 వేల పాఠశాలలకు పరిమితం చేసే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను నిలిపివేసి ప్రతి విద్యార్థికి అందుబాటులో, నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ విద్యా సంస్థల బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది అన్నారు. ప్రజా విద్య పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధనలో సమాజంలోని అన్ని వర్గాలు చూపిన సంఘీభావం విద్యార్థి ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చిందని పేర్కొన్నారు. ప్రజా విద్యను పరిరక్షించడం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి తన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని తెలిపారు.


# పీఎంఏవై గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

**- హౌసింగ్ జనరల్ మేనేజర్ లీలారాణి**



**ఇబ్రహీంపట్నం, జూలై 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** పీఎంఏవై పథకంలో లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని హౌసింగ్ జనరల్ మేనేజర్, ఎన్టీఆర్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ లీలారాణి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో పీఎంఏవై అర్బన్ 2.0 పథకం లబ్ధిదారులను శుక్రవారం ఆమె నేరుగా కలిసి మాట్లాడారు. మైలవరం సబ్ డివిజన్ లోని సిమెంట్ అండ్ స్టీల్ గోడౌన్ ను తనిఖీ చేశారు. అనంతరం పీఎంఏవై అర్బన్ 2.0 పథకంపై అధికారులతో సమీక్ష చేశారు. పీఎంఏవై లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.లక్ష, ఎంజిఎన్ఆర్ఈజీఎస్ నిధులనుంచి మరో రూ.39 వేలు, 90 రోజుల పని దినాల్లో రూ.27 వేలు, మరుగుదొడ్లకు రూ.12 వేలు మొత్తం రూ.2.89 లక్షలు అందించనున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలంలో 115 గృహాలు మంజూరు కాగా 42 గృహాల నిర్మాణం ప్రారంభించలేదని, బిలో బేస్మెంట్ లెవల్ లో 30, బేస్మెంట్ లెవల్లో 24, రూమ్ లెవెల్ లో 8, రూఫ్ కాస్ట్ 11 ఉన్నాయని, కొండపల్లి పట్టణ పరిధిలో 90 గృహాలు మంజూరు కాగా 13 గృహాలు ప్రారంభించలేదని, బిలో బేస్మెంట్ లెవల్ లో 42, బేస్మెంట్ లెవల్లో మూడు, గ్రూప్ కాస్ట్ లో 21 ఉన్నాయని చెప్పారు. అధికారులు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి త్వరగా గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తలూరు లో శ్రీ పోలేరమ్మ ఆలయంలో చోరీ....



**చేజర్ల జూలై 10 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని చిత్తలూరు గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ అమ్మ వారి ఆలయంలో గురువారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పోలేరమ్మ అమ్మవారి గుడి తాళాలు పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి అక్కడ ఉన్న రెండు హుండీలలో సుమారు 25 వేల రూపాయలు అపహరించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమాచారం స్థానిక పోలీస్ స్టేషన్ కి అందించగా పోలీసులు వచ్చి గుడి తాళాలు పగలకొట్టిన తీరును మరియు అమ్మవారి గుడి పరిసర ప్రాంతం మొత్తం పరిశీలించడం జరిగినది. అర్ధరాత్రి వేళలో ఆలయాలలో జరుగుతున్న చోరీలను దృష్టిలో పెట్టుకుని రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ కాసి పూర్తి నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కుల, మత, పార్టీలు చూడకుండా పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

● ప్రజా వేదికలో 29 కుటుంబాలకు రూ.22 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాము..



**గుడివాడ,జూలై 10 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కుల, మత, పార్టీలు చూడకుండా పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమి ప్రభుత్వమంటేనే పేదల ప్రభుత్వమని ఆయన ఉద్ఘాటించారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మరియు కూటమి నాయకులతో కలిసి నియోజకవర్గ పరిధిలోని 29 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.22 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలు చూడకుండా కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు అండగా ఉంటూ సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. గత 25 నెలల పాలనలో గుడివాడ నియోజకవర్గానికి రూ. 6.80 కోట్ల సీఎంఆర్ఎఫ్ నగదు మంజూరు చేయించడం మా అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, గుడివాడ గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, పోలవరపు వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు యార్లగడ్డ సుధారాణి, దారపురెడ్డి మనీశ్వరరావు, ఆర్నేపల్లి పాండు, భవాని, వంగ పండు ఆదినారాయణ, గుత్తా చంటి, చేకూరు జగన్మోహన్రావు, అల్లాడ శ్రీనివాస్, డేవిడ్, రెడ్డి అప్పారావు, జనసేన నాయకులు వేమూరీ త్రినాథ్, పూర్ణ, నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికి కోసమే కొడాలి నాని వ్యాఖ్యలు జనసేన నేత సందు పవన్..



**గుడివాడ,జూలై 10 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గ జనసేన నాయకులు సందు పవన్ వారి కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందు పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని లక్ష్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్న సంఘవిద్రోహశక్తులను పెంచి పోషిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో పవన్ కళ్యాణ్ గారికి వస్తున్న పరిపాలన చరిష్మాను చూసి ఓర్వలేకనే వైసిపి తన అక్కసను కొంతమంది యూట్యూబర్, పెయిడ్ పేటీఎం ఆర్టిస్టులను ఉసిగొలుపుతుంది. ప్రశ్న రావణ్ వెనకమాల ఉన్నది ముమ్మాటికి వైసిపి పార్టీ నే అని. తాడేపల్లి ప్యాలెస్ లో జగన్ యాక్షన్ చెప్పటం. రాష్ట్రంలో వైసిపి మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఆర్టిస్టులు లాగా నటించడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు అన్నారు. దేశ సమగ్రతను దెబ్బతీస్తూ. హిందూ దేవుళ్లను దూషించినటువంటి ప్రశ్న రావణ్ని కూటమి ప్రభుత్వం అరెస్టు చేసినందుకు వైసిపి నాయకులు తెగ బాధ పడిపోతున్నారని సందు పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రజానీకం పై కక్ష తీర్చుకుంటున్నాడని అన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండటం వైసిపి పార్టీ నాయకులకు కడుపు మంటగా ఉందని పవన్ విమర్శించారు. గుడివాడలో గడిచిన రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని చూసి కొడాలి నాని జీవితంలో తాను మరొకసారి ఎమ్మెల్యే కాలేనని నిర్ధారణకు వచ్చి తన ఉనికి కోసం పనికిమాలిన విమర్శలు చేస్తున్నాడని ఆయన అన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పవన్ కళ్యాణ్ గారిపై జనసేన పార్టీపై చౌకబార్ విమర్శలు చేస్తున్నారని. రాష్ట్ర ప్రజానీకం కొడాలి నాని, జగన్మోహన్ రెడ్డిని రాజకీయ జోకర్లాగా భావిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు సయ్యద్ నజీర్, ఉంగరాల శేషగిరిరావు, గాడి కిరణ్, బురిడీ శాంతి నాయుడు, గద్దం శ్రీను, కందికొండ దుర్గ, మోగసాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ



**గుడివాడ,జూలై 10 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణ కళాకారుల సంఘం నెలవారీ పెన్షన్‌లో భాగంగా కళాకారులకు, పట్టణ కళాకారుల సంఘం వారు నిర్వహిస్తున్న, ప్రతినెలా 24 మంది కళాకారులకు ఒక్కొక్కరికి 1000, చొప్పున 24,000 రూపాయలు పంపిణీ చేయడం జరిగింది. ఈ 24,000 స్పాన్సర్ చేసిన దాతలు పట్టణ కళాకారుల సంఘం, గౌరవ అధ్యక్షులు నెరుసు చింతయ్య, పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షులు కొడాలి రాజా, మట్టా రాజా, యార్లగడ్డ సత్యనారాయణ, ఎస్ కోటేశ్వరి, జి రత్నశ్రీ (కడప), ఎం.వి.జి ఆంజనేయులు, శ్రీరం శ్రీనివాసరావు, జన్ను బాబురావు, సలాది మల్లికార్జునరావు నాయుడు, పోలుకొండ నాగుల్, పి. అనీల్, బాగాది కృష్ణ, కొల్లరెడ్డి నాగిరెడ్డి, పటా ఖాన్, రాధాకృష్ణ, కస్తాల దుర్గారావు (నందిగామ), మరడాని వెంకటేశ్వరావు చలసాని కృష్ణా, కొత్త వెంకటేశ్వరవు, కొలుసు రాజా, పాపనబోయిన వెంకటేశ్వరావు, వెంకట్ రెడ్డి, హైదరాబాద్ వీరందరికీ పట్టణ కళాకారుల సంఘం గుడివాడ వారి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు.. అలాగే ఈ 24,000 తీసుకున్న కళాకారులు కృష్ణ (క్లారినెట్), సుబ్బారావు (సుబ్బిశెట్టి), కొంగమేడ విజయ, పి. బాబ్జీ, రాములు (హార్మోనిస్టు) చంద్రం (హార్మోనిస్టు), రవి, శివ కుమారి, సత్యనారాయణ, గంధం రాజేశ్వరి, బండి రాణీ, లక్ష్మి, రాఘవులు, గోవింద్ (మెకప్) మందా కుమారి నరసింహ రావు, పద్మా దేవి జనార్ధన గౌడ్ రామకృష్ణ (డొలక్), సీతాకుమారీ, సుబ్రమణ్యం (సింగర్), శ్రీను డొలక్, వీరందరూ ఒక్కొక్కరు 1000 రూపాయలు చొప్పున జీవితకాలం పెన్షన్ పొందుతున్న కళాకారులలో ఉన్నారు.

## శిక్షణా కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఉపయోగించండి - ఎంపీపీ మార్కాపూడి గాంధీ



**పెనుగంచిప్రోలు,జూలై 10 (వార్తాప్రభ) :** మండల పరిషత్ కార్యాలయం పెనుగంచిప్రోలు లో గ్రామపంచాయితీల అభివృద్ధి ప్రణాళిక జీపీడీపీ , మరియు మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక బీపీడీపీ ల గురించి శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు మార్కపూడి గాంధి, ఎంపిడిఓ శ్రీమతి జి.శ్రీను, వైస్ ఎంపీపీ గుంటుపల్లి శ్రీనివాసరావు ( వాసు) మరియు ఎంపీటీసీ సభ్యులు, డిప్యూటీ ఎంపిడిఓ కేవీ.సుబ్బారావు,ఎం ఈ ఓ రవీంద్ర ఇంకా మండల స్థాయి అధికారులు,పంచాయితీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, వివిధ పంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ,వివిధ గ్రామాల వోఓ ఏ లు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు, ట్రైనింగ్ శిక్షకులు జి శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు జీపీడీపీ గురించి వివరించటమైనది,.. ఈ సందర్భంగా ఎం పి పి మార్క పూడి గాంధీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ఉద్యగులు, శిక్షణ యెక్క ఉద్దేశాలు తెలుసుకుని గ్రామ అభివృద్ధి కీ మంచి ప్రణాళికలు తయారు చేసుకొని గ్రామ అభివృద్ధి సహకరించగలరని తెలియ చేశారు.

## శ్రీ గోపయ్య స్వామి తలపాగాకు 1,01,116 రూపాయలు విరాళం..



**పెనుగంచిప్రోలు, జూలై 10 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పెనుగంచిప్రోలు లో తెలంగాణ రాష్ట్రం, కోదాడ పట్టణ వాస్తవ్యులు (లేట్) వెంకన్న గౌడ్, మల్లికా దంపతుల కుమార్తె , అల్లుడు కళాసాగర్ అనన్య దంపతులు (ఎన్ఆర్ఐ) ఆలయ కార్య నిర్వహణ అధికారి జివిడిఎన్ లీలా కుమార్ సూచనల మేరకు శ్రీ గోపయ్య స్వామి వారి బంగారు తలపాగ తయారుచేయు పథకమునకు 1,01,116 రూపాయలు విరాళముగా ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసముకు అందజేసినారు. వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, ఆలయ అర్చకులు, వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థప్రసాదములు అందజేసినారు..



జై వాసవి వాసవి క్లబ్ వనిత విదర్భపురి గుడివాడ వారి ఆధ్వర్యంలో కమిటీ మెంబర్ అయినటువంటి బొగ్గరపు పద్మావతి డాన్ టు డస్క్ సేవా కార్యక్రమంలో భాగంగా బేతవోలు కంచి కామాక్షి గుడిలో స్టాండ్ ఫ్యాను అందజేసినారు. ఈ కార్యక్రమానికి పాస్ట్ గవర్నర్ తాత రజిని, క్లబ్ ప్రెసిడెంట్ వేముల అనసూయ, కార్యదర్శి దివ్వేల ఉషారాణి హాజరయ్యి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు.

**-గుడివాడ,జూలై 10 (వార్తాప్రభ) :**

## గాంధీనగర్ లో నూతన వంతెనను ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్..



**కృత్తివెన్ను,జూలై 10 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం ఎండపల్లి గ్రామ శివారు గాంధీనగర్ లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న పబ్లిక్ - ప్రైవేట్- పీపుల్ పార్ట్నర్షిప్ (పి 4) కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలందరి సహకారంతో నూతన వంతెనను నిర్మించి, నూతన వంతెనను పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా శుక్రవారం ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, , పిన్నింటి రత్తయ్య, చేకూరి వెంకట్రావు, కూనసాని చిన్న శీరం ప్రసాద్ చలపాటి ప్రసాద్ యాదం రెడ్డి కొండ దాసరి శ్రీను పుప్పాల నరసింహారావు సుధా బత్తుల రమేష్ పి లక్ష్మణరావు ఆకుల కృష్ణ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఉచిత మూత్రపిండాల ఆరోగ్య పరీక్షల శిబిరం - 124 మందికి వైద్య పరీక్షలు



**హనుమాన్ జంక్షన్,జూలై 10 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ శాఖ ఆధ్వర్యంలో "స్నేహ సంచారిణి ల్యాబొరేటరీ సర్వీస్" సహకారంతో ఉచిత మూత్రపిండాల ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ బట్టు చందు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 124 మంది పాల్గొని ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మూత్రపిండాల సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించే లక్ష్యంతో బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, క్రియాటినిన్, హెపటైటిస్-బి, యూరిన్ ఆల్బుమిన్, రక్తపోటు (బీపీ), ఎత్తు, బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (BMI) తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆరోగ్య నిపుణులు పాల్గొన్న వారికి ఆరోగ్య సూచనలు అందించి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మూత్రపిండాల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ మార్కెటింగ్ మేనేజర్ కిరణ్, బ్రాంచ్ మేనేజర్ బట్టు చందు, బ్రాంచ్ సిబ్బంది, స్నేహ సంచారిణి ల్యాబొరేటరీ ఆరోగ్య శిబిరం బృందం పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# మడిచర్లలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరం

● పశుపోషణ ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందాలి డాక్టర్ ఎం ప్రమీలారాణి









**హనుమాన్ జంక్షన్, జూలై 10 (వార్తాప్రభ) :** శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, గన్నవరం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపులపాడు సహాయ సంచాలకులు డా. ఎం. ప్రమీలరాణి మాట్లాడుతూ, పశుపోషణ ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ రైతులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించాలని కోరారు. శిబిరంలో భాగంగా పేడ పరీక్షలు నిర్వహించడంతో పాటు 60 పశువులకు, 200 జీవాలకు నులిపురుగుల నివారణ మందులు అందించారు. అదనంగా సుమారు 80 పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు నిర్వహించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. రాంబాబు, డా. రమేష్ బాబు, డా. వసంతకుమారి, డా. షేక్ మస్తాన్ బి, డా. సురేష్, డా. నవీన్, డా. రంగారావు, రేమల్లె పశువైద్యాధికారిణి డా. సుధారాణి, ఎన్డీడీబీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, విజయ డెయిరీ సొసైటీ అధ్యక్షుడు బళ్ళమూడి కృష్ణ , కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ పిడికిటి రాంబాబు, టీడీపీ నాయకులు పుట్టా సురేష్ , మోటూరు వాసు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలోవిజయవంతమైన మెగా ఉచిత వైద్య శిబిరం - వేలాది మందికి సేవలు





**తిరువూరు,జూలై 10 (వార్తాప్రభ) :** పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు సృజన ఫౌండేషన్ సహకారంతో తిరువూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో భారీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండే కళ్యాణ మండపం ప్రాంగణం జనంతో నిండిపోయింది. తిరువూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వృద్ధులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. శిబిరంలో అందించిన ప్రధాన సేవలు:స్పెషాలిటీ వైద్య పరీక్షలులి: జనరల్, గైనక్, పీడియాట్రిక్స్, ఆర్థో, కంటి, దంత, ఈఎన్టీ, చర్మ వ్యాధి నిపుణుల పరీక్షలుఉచిత దయాగ్నోస్టిక్ పరీక్షలులి: షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, ఈసీజీ, బోన్ డెన్సిటీ తనిఖీలు ఉచిత మందుల పంపిణీ కంటి పరీక్షల అనంతరం ఉచిత కళ్ళద్దాల పంపిణీ అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం రిఫరల్ సేవలుసృజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, వాలంటీర్లు శిబిరంలో పాల్గొని సేవలందించారు. చాలామంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందారు. శిబిరానికి వచ్చిన లబ్ధిదారులు ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. "ఆసుపత్రికి వెళితే అయ్యే ఖర్చు ఇక్కడ ఆదా అయింది. ఇలాంటి శిబిరాలు మరిన్ని ఎమ్మెల్యే గారి ఆధ్వర్యంలో నిర్వహించాలి" ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సృజన ఫౌండేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు..



**కాకినాడ,జూలై 10 (వార్తాప్రభ) :** వ్యక్తి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని అడ్మిన్ ఎస్పీ డా.కిషోర్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం మూడవ పట్టణ పోలీసు స్టేషనులో ఆయన మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. మే నెల 10వ తేదీన స్థానిక సాంబమూర్తి నగర్, రెండవ వీధిలో రేచర్లపేటకు చెందిన మొజ్జు సతీష్ (21) మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందడంతో కాకినాడ మూడవ పట్టణ పోలీస్ కేసు నమోదు చేసి,దర్యాప్తులో భాగంగా నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో మృతుడు హత్యకు గురైనట్లు నిర్ధారణ కావడంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేశారు. కాకినాడ ఇన్చార్జ్ ఎస్డీపివో,జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేసి 3 టౌన్ ఇన్స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ కుంచె ప్రభు తేజ,కుంచె నాని,పెరుగు అంజలి ఏ రాణి లను అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్, మసాలా దంచే కర్ర, ప్లాస్టిక్ గొట్టం మరియు A-1 సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో A-1 కుంచె ప్రభు తేజ ఇన్స్టాగ్రామ్ లో "కాకినాడ కుర్రోడు" పేరుతో వీడియోలు చేస్తుండగా, మృతుడు మొజ్జు సతీష్ అతని వద్ద హెల్పర్ గా పనిచేస్తూ వారి ఇంట్లోనే నివసిస్తున్నట్లు తెలిసింది. మృతుడు గతంలో A-1 ఇంటి నుండి సుమారు రూ.30,000 నగదు మరియు మూడు సెల్ఫోన్లు దొంగిలించినట్లు, అనంతరం దొంగిలించిన నగదును తిరిగి ఇవ్వకపోవడంతో పాటు వారిని దూషించడంతో ఆగ్రహించిన నిందితులు అతడిని హత్య చేయాలని పథకం రచించినట్లు విచారణలో వెల్లడైంది.కార్యక్రమంలో మూడవ పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'సర్' కార్యక్రమం





**నూజివీడు,జూలై 10 (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గౌరవ జిల్లా కలెక్టర్, ఏలూరు వారు జిల్లా వ్యాప్తంగా నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పర్యవేక్షణ చేస్తున్నారని, అలాగే గౌరవ సబ్ కలెక్టర్, నూజివీడు వారు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమ పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నారని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులలో బూత్ లెవల్ అధికారులు (BLO\T) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధృవీకరణ, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, అవసరమైన ధృవపత్రాల పరిశీలన మరియు డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో 79.58 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి మున్సిపల్ యంత్రాంగం, ఎన్నికల అధికారులు మరియు దీూలు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీతో SIR కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించనివారు లేదా అవసరమైన ధృవపత్రాలు అందజేయనివారు వెంటనే తమ పోలింగ్ స్టేషన్కు సంబంధించిన దీూను సంప్రదించి, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిచేయడంతో పాటు అవసరమైన పత్రాలను సమర్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. గౌరవ జిల్లా కలెక్టర్ గారు మరియు గౌరవ సబ్ కలెక్టర్, నూజివీడు వారు ఇచ్చిన ఆదేశాల మే-రకు, ఓటరు జాబితాను సంపూర్ణంగా, ఖచ్చితంగా రూపొందించడం ఎన్నికల సంఘం లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో ప్రతి అర్హత గల ఓటరు భాగస్వామి కావడం అత్యంత అవసరం. నిర్దేశిత గడువులోగా అవసరమైన ధృవపత్రాలు సమర్పించని పక్షంలో, సంబంధిత ఓటర్ల వివరాలు తుది ప్రక్రియలో పరిగణించబడకపోవడంతో, వారి ఓటుహక్కుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉండవచ్చు. అందువల్ల నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువు ముగిసేలోపు తమ వివరాలను ధృవీకరించుకోవాలని కోరుతూ ఓటరు జాబితాను సంపూ-ర్ణంగా రూపొందించడంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము. "ఈరోజు మీ వివరాలను ధృవీకరించండి... రేపటి మీ ఓటు హక్కును భద్రపరచుకోండి."

# ముచ్చిలిగుంటలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన కాగిత

### –భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం అన్న ఎం ఎల్ ఎ

**పెడన,జూలై 10 (వార్తాప్రభ) :** పెడన మండలం ముచ్చిలిగుంట గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్పుస్తకాలను శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పంపిణీ చేసారు. రీ–సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించటంతో పాటు రాజముద్రతో అందించే పట్టా దారు పాసు పుస్తకాలు రైతులకు భరోసా కలిగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రీ–సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనిఅన్నారు. భవిష్యత్లో రైతులు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఈ పాసు పుస్తకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గత పాలకులు వ్యవస్థలను ఎలా నాశనం చేశారో అందరికీ తెలుసన్నారు. భూ యజమానుల ఫోటోలతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని హర్షం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమం లో అర్జా నగేష్ శలపాటి ప్రసాద్



మాజీ సర్పంచ్ కాగిత నాగబాబు కాగిత వాసు కాగిత సాగరజంగం డిప్యూటీ తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఏజెంట్ జడ శ్రవణ్

### ● పవన్ కళ్యాణ్ పై ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్,జూలై 10 (వార్తాప్రభ) :** జడ శ్రవణ్ కుమార్ వైసీపీ ఏజెంట్ అని పవన్ కళ్యాణ్ పై శ్రవణ్ కుమార్ చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే పంతం నానాజీ ఖండించారు.పాత్రికేయ సమావేశంలో వైసీపీ చేస్తున్న కుట్రలపై ఎమ్మెల్యే పంతం తీవ్రస్థాయిలో మండిపడ్డారు.గతంలో ఇతర రాష్ట్రాలలో ఘర్షణలు సృష్టించిన శక్తులు ఇప్పుడు వైసీపీ రూపంలో ఆంధ్రప్రదేశ్ లో కుల మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని, ఏలూరు సభ వేదికగా జోసెఫ్ అలియాస్ రావణ్తో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని దూషించడం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని ఆయన ఆరోపించారు.అర సూట్, హాఫ్ కట్ ఫిట్ సూట్ వేసుకున్న జాడ శ్రవణ్ లాయర్ కి తక్కువ,బెయిల్ కి ఎక్కువ కోర్టులో కనీసం ఒక బెయిల్ కూడా తీసుకొచ్చేది లేదు ఇతనికి అసలు లాయర్ అనిపించుకునే అర్హత ఎక్కడుందని ప్రశ్నించారు.చట్ట ప్రకారం దేశద్రోహం కేసు ఎదుర్కొంటున్న రావణ్ లాంటి వ్యక్తికి మద్దతుగా నిలిచిన ఈ శ్రవణ్ ఏం చేయబోతున్నాడు అనే దానిపై పోలీసు నిఘా వ్యవస్థ పని చేస్తోందని,ఇలాంటి క్రిమినల్స్ కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ గొడవలతో తమకు సంబంధం లేదని , మా మిత్రులు, సన్నిహితులు క్రైస్తవ సోదరులే చెబుతున్నారని, ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న డ్రామా అని స్పష్టం చేశారు.నాడు సుగాలి ప్రీతికి జరిగిన అన్యాయంపై గొంతు విప్పిన మద్దతుగా నిలిచిన పవన్ కళ్యాణ్ పైనే నేడు ఆమె తల్లితో కేసు పెట్టించడం అత్యంత దారుణమని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వనాశనం చేసిన వ్యవస్థలను ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. కులాలు, మతాలు పుట్టకముందే సనాతన ధర్మం పుట్టిందనే సత్యాన్ని వైసీపీ సన్నాసులు,జడ శ్రవణ్ కుమార్,రావణ్, ప్రకాష్ రాజ్ లాంటి విధ్వంసకారులు తెలుసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ హెచ్చరించారు.

# కలెక్టరేట్, జిల్లా కోర్టు ప్రాంగణాలలో ప్రతివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

### -కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ

**కాకినాడ,జూలై 10 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలోని జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు (డిస్ట్రిక్ట్ కోర్టు) ప్రాంగణాలలో ప్రతి వారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. 37వ డివిజన్ పరిధిలో ఉన్న జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు ప్రాంగణాలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యాలయాల పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రభుత్వ కార్యాలయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు లలో ఇకపై ప్రతి వారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పిచ్చిమొక్కల తొలగింపు,చెత్త సేకరణ, పరిసరాల శుభ్రత పనులను క్రమం తప్పకుండా చేపడతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే



ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం నగరపాలక సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు,శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎ. సత్తిబాబు,బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండి నరేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు-శాస్త్రవేత్తల చర్చా..కిసాన్ ఇష్టాగోష్టి



**మైలవరం,జూలై 10 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,మైలవరం పట్టణంలోని రైతు సేవ కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వారి ఆద్వర్యంలో శుక్రవారం రైతులు, శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ అధికారుల మధ్య చర్చా మరియు కిసాన్ ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో డిడిఏ, డి ఆర్ సి డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో నేలలోని తేమ నిలిపి ఉంచేలా పచ్చిరొట్ట విత్తనాలు, అంతర పంటలు గురించి వివరించార. సిఐపిఎంసి విజయవాడ అసిస్టెంట్ డైరెక్టరు డా.కె. వీరయ్య చౌదరి ప్రత్తి పంటలో సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతు ల గురించి వివరించారు.పురుగుల ఉధృతి గుర్తించటానికి పసుపు జిగురు అట్టలు మరియు లింగాకర్షక బుట్టలు పెట్టాలని రైతులకు సూచించారు.సీనియర్ సైంటిస్టు మరియు హెడ్ కెవికె గరికపాడు నుంచి డా. ఎం.రవి కిషోర్ ప్రత్తి,అపరాలు , వరి యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.వర్షాభావ పరిస్థితులలో ప్రత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువ ఉంటుంది కాబట్టి పురుగు ఉధృతి గమనించి ఎక్కువ ఉన్నట్లైతే ఫ్లోనికామిడ్ 0.4 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. వర్షాభావ పరిస్థితులలో ఎక్కువ బెట్టకు పంట లోనైతే 19-19-19-10 ను లీటరు నీటికి మరియు 13-0-45-5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చేయాల్సిందిగా తెలిపారు. వరి పంటకు తగి నంత నీరు లేనప్పుడు మినుము, పెసర, కంది పంటలు సాగుచెయ్య వలసినదిగా తెలిపారు.

**మామిడి పంట ఐపోయిన వెంటనే ఎండు పుల్లలు కత్తిరించాలి :** ఉదోనవన శాస్త్రవేత్త కెవికె గరికపాడు డా. కె.లక్ష్మీకళ మాట్లాడుతూ మామిడి పంట ఐపోయిన వెంటనే ఎండు పుల్లలు కత్తిరించాలని తెలిపారు.నేలలో తేమ ఉన్నప్పుడే ఎరువు వేసుకోవాలని సూచించారు.ఈ కారక్రమంలో సిఐపిఎంసి విజయవాడ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డా.వై.మానస, ఏడిఏ డిఆర్ సి పి.మోనిష, డి ఆర్ సి వ్యవసాయ అధికారి కె. పద్మజా రాణి,మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు యమ్. శ్రీనివాసరావు,మైలవరం మండల వ్యవసాయ అధికారి కె. సంధ్యారాణి, మైలవరం సోసైటీ చైర్మన్ కరెడ్ల వెంకట నారాయణ,ఏ ఈ వో, వి ఏ ఏ పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలకు మెయిల్ క్రిష్ణారెడ్డి బాసట...

### ● బంగారు కుటుంబాల సాధికారతే లక్ష్యం ● జీవనోపాధి యూనిట్ల సుస్థిర నిర్వహణపై అవగాహన...





**గుడ్లవల్లేరు,జూలై 10 (వార్తాప్రభ) :** పేదరిక నిర్మూలకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి కషి చేస్తూ...బాసటగా నిలుస్తున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ కొనియాడారు. బంగారు కుటుంబాల సాధికారతే లక్ష్యం -- జీవ-నోపాధి యూనిట్ల సుస్థిర నిర్వహణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పీ4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్ పార్ట్నర్షిప్) జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో 100 మంది బంగారు కుటుంబాలకు ప్రీ--గ్రౌండింగ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బంగారు కుటుంబాల సభ్యులతో పాటు బంగారు మిత్రలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మెయిల్ ప్రతినిధి చేతన్ హాజరై జీవనోపాధి యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించడం, ఆదాయాన్ని పెంచుకోవడం, నాణ్యతను కాపాడుకోవడం, మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవడం, పొదుపు అలవాటు చేసుకోవడం వంటి అంశాలపై కుటుంబాలకు విస్తతంగా అవగాహన కల్పించారు. జీవనోపాధి యూనిట్లను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా కుటుంబ ఆర్థికాభివద్ధికి బలమైన పునాదిగా తీర్చిదిద్దాలని సూచించారు. కుటుంబ సభ్యులందరూ బాధ్యతతో భాగస్వాములై యూనిట్లను నిర్వహిస్తే స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు కుటుంబం ఆర్థికంగా స్వయం సమద్ధిని సాధించగలదని వివరించారు. బంగారు మిత్రలు లబ్ధిదారులకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తూ, యూనిట్ల పురోగతిని పర్యవేక్షించి అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తారని తెలిపారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలన, కుటుంబాల ఆర్థిక సాధికారత, స్థిరమైన జీవనోపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం, ఎంఈఐఎల్ మరియు ఏపీఎంఏఎస్ సమిష్టిగా పనిచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న బంగారు కుటుంబాలు జీవనోపాధి యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించి తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# బహుజన రాజ్యాధికారం సాధించడానికి అన్ని బీసీ కులాలు ముందుకు రావాలి

### ● బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పిలుపు

### ● బీసీ ఐక్యవేదికకు మద్దతు తెలిపిన నాయి బ్రాహ్మణ సంఘం

**హైదరాబాద్,జూలై 10 (వార్తాప్రభ) :** బహుజన రాజ్యాధికారం సాధించటానికి బీసీ కులాల, బీసీ సంఘాల నాయకులను గత నెల నుండి కలిసి ఐక్యత పెంచేందుకు, బహుజనులకు రాజ్యాధికారం సాధనకై కృషి చేయాలనేదే బీసీ ఐక్యవేదిక ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నదని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పేర్కొన్నారు. బీసీ కులాలన్నిటికీ మరియు ముఖ్య నాయకులను బేరి రామచందర్ యాదవ్ కలిసి పోరాటాలను పిలుపునిస్తూ ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల నాయకులను కలిసే క్రమంలో శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంగలి సాయిలు నాయి బ్రాహ్మణ కార్యవర్గ నాయకులను కలవడం జరిగింది. చర్చల సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం కార్యవర్గం మొత్తం బీసీ కులాల సంఘాలకు ఐక్య వేదికకు పూర్తి మద్దతు తెలిపడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి చర్చించడం జరుగుతుందని అన్ని కుల సంఘాల నాయకుల మద్దతుతో అధికారం సాధిస్తామని అన్నారు. ముదిరాజ్, యాదవ్, పద్మశాలి ,గౌడ్స్ మున్నూరు కాపు సంఘాలను కలవడం జరుగుతుందని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కొన్ని కులాలకు ఇప్పటికీ కూడా గుర్తింపు లేకుండా పోయిందనీ, రోడ్లపైనే ఉండటానికి ఇల్లు లేక జీవనాధారం లేక బ్రతుకు ఈడుస్తున్నారని అని పేర్కొన్నారు. కనీసం కులంపేరు కూడా చెప్పుకోలేని స్థితిలో కొన్ని కులాలు బాధపడుతున్నాయని అన్నారు. మరి రాష్ట్రంలో కులాల దామాషా పద్ధతిన ఎవరికి రావాల్సిన వాటా వారికి అందాలని అన్నారు. విద్యతో



సహా వైద్యం, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కావాలని బీసీలు మేమెంతో మాకంత విద్యా ఉద్యోగ రంగాలలో రాజకీయ రంగాలలో సమాన హక్కులు కల్పనపై అందరూ కలిసి పోరాటం చేద్దాం అన్నారు. ఈ పోరాటంలో అన్ని కుల సంఘాలు అందరు నాయకులు బీసీ కులాల ఐక్యవేదికకు పూర్తి మద్దతు తెలిపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తో పాటు సాయన్న ముదిరాజ్, ఆర్గనైజర్ సెక్రెటరీ హరికృష్ణ చారి, యువజన సంఘం అధ్యక్షులు కుమార్ యాదవ్, సాయి కురుమ, రాజు గౌడ్, పద్మశాలి అశోక్, కిరణ్ ముదిరాజ్, రజక సంఘం మల్లేష్, పెద్దలు యువత అందరికి రాజ్యాధికారం కోసం చర్చించారు. అన్ని కుల సంఘాల నాయకులు బేరి రామచందర్ యాదవ్ ఫోన్ నెంబర్ సంప్రదించవలసిన 89 78 99 98 96, సాయన్న ముదిరాజ్ 9951881755 సంప్రదించవచ్చున్నారు.

# చేపల పెంపకంలో కోళ్ల వ్యర్థాలు వినియోగించకూడదు

### ● మత్స్యశాఖ జిల్లా అధికారి సి.ఎస్. చక్రాణి ● కవులూరు గ్రామంలో ఘనంగా జాతీయ చేపల రైతుల దినోత్సవం





**జి.కొండూరు(కవులూరు),జూలై 10 (వార్తాప్రభ) :** చేపల పెంపకంలో కోళ్ల వ్యర్థాలు వంటి అనారోగ్యకరమైన మరియు కాలుష్యానికి దారితీసే పదార్థాలను వినియోగిం చకూడదని మత్స్యశాఖ జిల్లా అధికారి సి.ఎస్. చక్రాణి వెల్లడించారు.ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం, కవులూరు గ్రామంలోని పీఏసీఎస్ లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మత్స్య శాఖాధికారి సి.ఎస్.చక్రాణి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బి.తేజస్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చక్రాణి చేపలు, రొయ్యల పెంపకం దారులకు పలు చూచన, సలహాలు ఇచ్చారు.భారతదేశ మత్స్యరంగంలో విప్లవాత్మక మా ర్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, చేపల ఉత్పాదకత, రైతుల ఆదాయం మరియు దేశ ఆహార భద్రతకు విశేషంగా దోహదపడిందని పేర్కొన్నారు.అలాగే ఆక్వాకల్చర్ను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం, చెరువుల నిర్వహణ లో పర్యావరణ హిత విధానాలను పాటించడం, నాణ్యమైన చేప పిల్లలు, మేత మరియు ఔషధాలను మాత్రమే వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.పరిశుభ్రమైన, పర్యావరణ అనుకూలమైన సాగు విధానాలను అవలంబిం చాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపల రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తు న్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవా లని కోరారు.ముఖ్యంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (PMMSY) క్రింద అందిస్తున్న హ్యాచరీలు, రియరింగ్ యూనిట్లు, బయోఫ్లాక్, రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్ (=ూూ), విలువ ఆధారి త మౌలిక సదుపాయా లు, మరియు ఇతర అభివృద్ధి పథకాలపై అవగా హన కలిగి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు తెలియ జేశారు. ఆక్వాకల్చర్ యూనిట్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, అనుమతులు కలిగిన యూనిట్లకే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సాంకేతిక సేవలు మరియు ఇతర సౌకర్యాలు అందుబాటు లో ఉంటాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ అమలుకు సంబంధించి జారీ చేసిన తాజా ప్రభుత్వ ఉత్తర్వుల (G.O.) ప్రకారం అర్హులైన రైతులు సంబంధిత నిబంధనలు పాటిస్తూ ప్రయోజనాల ను పొందాలని ఆమె పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఉంటేనే పవర్ సబ్సిడీ ఉంటుందని తెలిపారు. చెరువులలో ఆక్సిజన్ తగ్గితే చేపలు చనిపోతా యని, చెరువులు లోపల శుభ్రంగా ఉండాలన్నా రు. మంచి సీడ్ తెచ్చుకుంటే లాభదాయకమైన దిగుబడి వస్తుందన్నారు.రొయ్యల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు చక్రాణి అవగాహన కల్పించారు.ముఖ్యంగా యాంటీ బయోటిక్ ఎక్కువగా వాడకూడదని, ఎగుమతి చేసిన చేపలులేదా రొయ్యలలో యాంటీబయోటిక్ కొద్ది శాతం ఉన్నా ఫారిన్ కంట్రీస్ వాళు కొనుగోలు చేయ్యరని అన్నారు. చేపలు,రొయ్యల చెరువుల్లో నీటిని బయటికి వదలే ముందు ఆ నీటిని బ్లీచింగ్ తో శుభ్రపరచా లన్నారు.అనంతరం కొంతమంది రైతులను మత్స్యశాఖ అధికారులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని పలువురు ఆక్వా రైతులు, గ్రామ మత్స్య సహాయకులు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాకు ఆగ్రహం తెప్పించవద్దు సాంబయ్య



**విస్సన్నపేట,జూలై 10 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల గ్రామపంచాయతీ పరిధి లోని వీర రాఘవపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మల్లెశీపల్లి సాంబశివరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాపై బురద చల్లి నాకు ఆగ్రహం తెప్పిస్తే వారికి ఇబ్బందులు తప్పవని తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలోని జి నారాయణ ఆస్తికి సంబంధించి 54 నెలల క్రితం జరిగిన రిజిస్ట్రేషన్ లో తన పాత్ర ఉందని ప్రచారం చేయటం దురదృష్టకరమని మరలా పునరావతం అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాను అన్నారు.

# కార్యదర్శి నిర్వాకం పై విచారణకు ఆదేశం..


**మోపిదేవి/అవనిగడ్డ,జూలై 10 (వార్తాప్రభ) :** 'అడ్డంగా వ్యవహరిస్తున్నా.....అడిగెదెవ్వరు.' శీర్షికన " వార్తాప్రభ "లో ప్రచురించిన కథనానికి ,గ్రామస్తుల అభ్యర్థనకు స్పందించిన అధికారులు ఘటనపై విచారణకు ఆదేశించారు.గ్రామ పంచాయతీకి ఆత్మ లాంటి మినిట్ బుక్ దుర్వినియోగం చేస్తూ ఆరు నెలల క్రితమే బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి మోపిదేవి మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీలో గ్రామస్తులకు అడ్డంగా దొరికిపోయిన విషయంలో గ్రామ ప్రముఖులు రావి వెంకటేశ్వరరావు నేతృత్వంలో పలువురు గ్రామస్తులు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిని కలిసి వీడియో ఆధారాలతో పాటు వినతి పత్రం అందజేశారు.జరుగుతున్న అక్రమాన్ని ప్రశ్నించిన తమపై సదరు కార్యదర్శి దుర్భాషలాడడంతో పాటు ,మీ వ్యవహారం చూస్తానని , మీపై కేసులు పెట్టి మిమ్మల్ని జైలు పాలు చేస్తానని బెదిరిస్తూ దౌర్జన్యపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. సదరు కార్యదర్శి వాసు నుండి వెంటనే రికార్డులు స్వాధీనం చేసుకుని,శాఖా పరమైన విచారణ జరిపి కుట్రపూరితంగా మినిట్ బుక్ దుర్వినియోగానికి పాల్పడిన అతనిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.దీనిపై స్పందించిన డిపిఓ సదరు కార్యదర్శి నుండి వెంటనే రికార్డులు స్వాధీనం చేసుకుని ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డివిల్పిఓ ను ఆదేశించినట్లు డిపిఓను కలిసిన వెంకటాపురం గ్రామస్తులు తెలిపారు.కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగం పై మోపిదేవి పోలీసులు మాజీ సర్పంచ్ రావి వెంకటేశ్వరరావును స్టేషన్ కు పిలిపించి విచారించినట్లు సమాచారం.

# హెల్మెట్ ధరించండి - ప్రాణాలను కాపాడుకోండి - ఎస్.ఐ. అర్జున్



**పెనుగంచిప్రోలు,జూలై 10 (వార్తాప్రభ) :** ఎన్ – హెచ్ 65 రోడ్డు పై హెల్మట్ ప్రాదాన్యం పై పెనుగంచిప్రోలు ఎస్ ఐ అర్జున్ వినూత్నంగా అవగాహన కల్పించారు, శుక్రవారం పోలీసు సిబ్బంది తో కలిసి తనిఖీ లు నిర్వహించి, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్వి చక్ర వాహన దారులకు అక్కడి క్కక్కడే కొత్త హెల్మెట్లు కొనుగోలు చేయించి సురక్షితం గా పంపించారు.హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణంతకమని హెచ్చరిస్తూ ప్రతి ఒక్కరు ట్రాపిక్ నిబంధన లు తప్పనిసరిగా పాటించాలని భద్రతకు ప్రాదాన్యం ఇవ్వాలని ఎస్ ఐ అర్జున్ సూచించారు..

# గర్భశ యక్యాన్సర్ కు చెక్ -- బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్స్ న్..



**పెనుగంచిప్రోలు, జూలై 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మండలం లోని ముళ్లపాడు, సుబ్బాయి గుడెం గ్రామాలకు చెందిన 14 ఏళ్ల బాలికలకు హెచ్ పి వి వ్యాక్స్ న్ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకిత జ్యోతి మాట్లాడుతూ ఈ టీకా గర్భశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను నివారించడం లో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు, ఇప్పటి వరకు మండలం లో సుమారు 20 మంది బాలికలకు హెచ్ పి వి వాక్స్ న్ వేసినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అంకిత జ్యోతి సూచించారు..

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188